www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

శనివారం
17-06-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 71, సంచిక : 355
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

మ్యూజియానికి నెహ్రూ పేరు తొలగింపు

భారత తొలి ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూ అధికారిక నివాసంగా ఉన్న తీన్‌మూర్తి భవన్ తాజా వివాదానికి కేంద్ర బిందువైంది. అందులో ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ పేరును ప్రధానమంత్రుల మ్యూజియంగా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

8లో

ఏపీలో అగ్నివర్షం

- రోహిణీని మరిపిస్తున్న మృగశిరకార్తె
- జూన్ 15 దాటినా తగ్గుముఖం పట్టని ఎండ తీవ్రత
- సీమ దాటని రుతుపవనాలు
- 18 తర్వాత తేలికపాటి వర్షాలు పడే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అగ్ని వర్షం కురుస్తోంది. భగభగ మండే ఎండలకు జనం మలమల మాడిపోతున్నారు. సహజంగా రోహిణీ కార్తెలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాని రోహిణీని మరిపించే విధంగా మృగశిరకార్తెలో ఎండలు మండిపోతున్నాయి. ఎండకు తోడు వడగాడ్పులు కూడా తీవ్రంగా ఉంటున్నాయి. జూన్ 15వ తేదీ తర్వాత కూడా ఎండ తీవ్రత ఏమాత్రం తగ్గకపోగా, ఇంకా తీవ్రమవుతుండడంతో జనం బేజారెత్తిపోతున్నారు. శుక్రవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా 44 నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఉష్ణతాపాన్ని తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోటలో 46.8 డిగ్రీలు, విజయనగరం జిల్లా కంతకపల్లె, తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 46.3 డిగ్రీలు అనకాపల్లి జిల్లా అనకాపల్లిలో 46.1, మన్యం జిల్లా కురుపాం, అప్పయ్యపేటలో 45.6, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 45.3, కోనసీమ జిల్లా మండపేట,ఈతకోటలో 45 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. అలాగే 370 మండలాల్లో తీవ్ర వడగాల్పులు,132 మండలాల్లో వడగాల్పులు వీచాయని తెలిపారు. అలాగే ఏలూరు జిల్లా పంగిడిగూడెం, ప్రకాశం జిల్లా కురిచేడు, ఎన్టీఆర్ జిల్లా నందిగామ, ఇబ్రహీంపట్నంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శనివారం కూడా రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు తీవ్ర ప్రభావం చూపనున్నట్లు విపత్తుల నిర్వహణ

- మిగతా 2 లో

పట్టెడన్నమూ కష్టమే

చేతులెత్తేసిన బీజేపీ సర్కారు

- దేశంలో ఆహార ధాన్యాల కొరత
- దిగుమతులపై కేంద్రానికి కొరవడిన ముందస్తు ప్రణాళిక
- గోదుమ నిల్వలపై పరిమితి విధింపు
- ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్రాలు బియ్యం కొనకుండా మరో కొర్రీ

న్యూదిల్లీ : కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలు పేద ప్రజల పొట్టకొడుతున్నాయి. పేదలు పట్టెడన్నమూ తినే పరిస్థితి లేకుండా పాలకుల చర్యలు ఉన్నాయి. ప్రచార్భాటం, ప్రగల్భాలు పలికే కాషాయ పార్టీ నేతలు ఇప్పుడు ఆహార ధాన్యాల సరఫరా విషయంలో చేతులెత్తేశారు. దేశ ప్రజల కడుపు నింపేందుకు అందుబాటు ధరల్లో, సరిపడా ఆహార ధాన్యాలు లభించేలా చూడటం కేంద్రం బాధ్యత. ఈ బాధ్యతను నెరవేర్చకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మొండి చేయి చూపుతోంది. ముందుచూపు లేని వైఖరి కారణంగా దేశంలో ఆహార ధాన్యాల కొరత ఏర్పడుతున్నది. ఫలితంగా వాటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరోవైపు ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఓఎంఎస్ఎస్) ద్వారా ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు బియ్యం కొనకుండా షరతు విధించింది. గోధుమలు, బియ్యం కొరత కారణంగా వీటి ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, వంట నూనెలు, కందిపప్పు సహా నిత్యావసర ధరలన్నీ పెరిగి పేదలు బతికే పరిస్థితులు లేవు. ఇప్పుడు ఆకలి తీర్చే బియ్యం, గోదుమల ధరలు పెరుగుతుండటం పేదలకు దెబ్బ మీద దెబ్బ కానుంది. కేంద్రం ప్రతి సీజన్‌లో ఆహార ధాన్యాల దిగుబడులు ఎలా ఉండనున్నాయో శాస్త్రీయ అంచనాకు రావాలి. డిమాండ్‌కు తగ్గట్టుగా

దిగుబడులు ఉండవనుకుంటే విదేశాల నుంచి దిగుమతి చేసుకునేందుకు ముందస్తు ప్రణాళికలు ఉండాలి. కానీ, ఈ ముందుచూపు కేంద్రానికి కొరవడింది. దీని ఫలితంగానే గోదుమలు, బియ్యం కొరత ఏర్పడుతున్నది. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు గోదుమల నిల్వలపై వచ్చే ఏడాది మార్చి 31 వరకు పరిమితి విధిస్తున్నట్టు కేంద్రం ఈ నెల 12న ప్రకటించింది. హోల్‌సేల్ వ్యాపారులు గరిష్ఠంగా 3 వేల మెట్రిక్ టన్నులు, రిటైలర్లు 10 మెట్రిక్ టన్నులు, ఫుడ్ ప్రాసెసర్లు మొత్తం సామర్థ్యంలో 75 శాతం మాత్రమే నిల్వ చేసుకోవాలని పరిమితి విధించింది. మన దేశంలో చివరగా 2006 ఆగస్టులో గోదుమల నిల్వలపై పరిమితి విధించింది. మళ్లీ ఇన్ని సంవత్సరాల తర్వాత పరిమితి విధించాల్సి వచ్చిందంటే ముంచుకొస్తున్న కొరత, పెరుగుతున్న ధరల తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2022 ఏప్రిల్‌లో ఎఫ్‌సీఐ వద్ద

- మిగతా 2 లో



ప్రొఫెసర్ హరగోపాల్‌పై 'ఉపా' కేసు దారుణం

- కేసీఆర్ స్పందించాలి
- బీహార్ సమావేశానికి కేసీఆర్, జగన్, చంద్రబాబు రావాలి
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: ప్రొఫెసర్ హరగోపాల్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేయడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రొఫెసర్ హరగోపాల్‌పై దేశ ద్రోహం కేసు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తప్పుపట్టారు. హరగోపాల్ ఒక ప్రొఫెసర్ అని, ఆయనకు ఎవరితోనూ సంబంధాలు లేవని నొక్కిచెప్పారు. హరగోపాల్‌పై కేసు పెట్టడాన్ని వ్యతిరేకించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వ్యక్తి హరగోపాల్ అని నారాయణ గుర్తుచేశారు. దీనిపై తెలంగాణ సీఎం కేసీఆర్ స్పందించాలని, కేసీఆర్ జోక్యం చేసుకుని హరగోపాల్‌పై ఎలాంటి కేసు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేకుంటే కేసీఆర్‌ను ఉద్యమ ద్రోహిగా చూడాల్సి ఉంటుందన్నారు. గతంలో వరవరరావుపైనా ఇలానే దేశద్రోహం కేసు పెట్టారని, ఆయన్ని జైల్లో వేశారని వివరించారు. మహిళలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అవమానిస్తోందని, న్యాయం కోసం పోరాటం

- మిగతా 2 లో

డబ్బు కోసమే ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్

- 24 గంటల్లో కేసు ఛేదించాం
- రూ. 86 లక్షలు రికవరీ చేశాం
- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తి అదుపులో ఉన్నాయి: డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను డబ్బు కోసమే కిడ్నాప్ చేశారని డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. డీజీపీ హెడ్‌క్వార్టర్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కిడ్నాప్ వ్యవహారంలో పోలీసులు పని చేసిన తీరును అభినందించారు. ఈ వ్యవహారంలో ముగ్గురు నిందితులు హేమంత్, రాజేశ్,

- మిగతా 2 లో

విశాఖలో ఎంపీ కుటుంబం కిడ్నాప్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలి

సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

2లో

ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా?

బుగ్గన వర్సెస్ యనమల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఆర్థిక పరిస్థితిపై అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. విజయవాడ బీసెంట్‌రోడ్ సమీపంలోని సెంట్రల్ గ్రావిటీ బిల్డింగ్‌లో వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ప్రాంతీయ జీఎస్‌టీ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దీనిపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. దీనిపై వెంటనే స్పందించిన ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు చర్చకు తాము ఎప్పుడైనా సిద్ధమేనని, సీఎం జగన్ పారిపోతున్నాడంటూ ప్రతి సవాల్ విసిరారు. అంతటితో ఆగకుండా ఇద్దరు నేతలు గత, ప్రస్తుత ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులపై పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్ల కంటే రాష్ట్ర జీఎస్‌టీ వసూళ్లలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో ఉందని బుగ్గన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.28,103 కోట్ల పన్నులు వసూలు

- మిగతా 2 లో

'ఆర్టీఈ' సీట్లు ఖాళీ

- ప్రైవేట్ పాఠశాలల్లో 71వేల మిగులు
- 1వ తరగతిలో పేదపిల్లలకు ప్రవేశాలే లక్ష్యం
- రెండేళ్ల నుంచి నిరాదరణ
- ప్రచార లోపం
- విద్యాశాఖ నిర్లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ)-2009 అమలులో జగన్ ప్రభుత్వం చేతులెత్తేసింది. ఆర్టీఈ 2009 చట్టం ద్వారా ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటవ తరగతిలో దక్కాల్సిన 90వేల సీట్లలో ఏకంగా 71 వేల సీట్లు మిగిలి పోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. విద్యా హక్కు చట్టానికి విస్తృత ప్రచారం కల్పించాలంటూ చట్టం చెబుతున్నప్పటికీ...దానిపై ఆచరణలో ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టలేదు. తల్లిదండ్రుల్లో అవగాహన లోపం, చట్టం అమలుపై ప్రభుత్వ ప్రచారం లేకపోవడం వెరసి దీనికి ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయి. ఇందులో అధికార యంత్రాంగం లోపం పూర్తిగా కన్పిస్తోంది. ఆర్టీఈ కింద 2023-24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు 90వేల సీట్లు అందుబాటులో ఉండగా, 18,749 మందికే సీట్లు లభించాయి. గత 2022-23 విద్యా సంవత్సరం నుంచే రాష్ట్రంలో ఆర్టీఈ అమలు చేస్తున్నారు. గతేడాది 3 శాతం సీట్లే నిండటం గమనార్హం. ప్రైవేట్ విద్యాసంస్థలలో ఉచిత విద్యకు ఈ ఏడాది దరఖాస్తులు 90వేల సీట్లు అందుబాటులో ఉంటే, 45,372 మందే దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 27,648 మంది ఆప్షన్లు ఎంపిక చేసుకోగా, 26,279 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో 18,749 మందికి సీట్లు దక్కాయి. అందులోనూ ఎంతమంది చేరుతారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. సీఎం జగన్ తక్షణమే స్పందించి రెండేళ్ల నుంచి ఆర్టీఈ చట్టం అమలు వైఫల్యాలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాల్సిన అవసరముంది. అందుకు బాధ్యులైన వారిపై చర్యలూ చేపట్టాలి. లేకుంటే ఆర్టీఈ చట్టం రాబోయే రోజుల్లో మరింతగా ఉనికిని కోల్పోయే ప్రమాదముంది.

తల్లిదండ్రులకు అవగాహన లేమి

ఆర్టీఈ చట్టంపై తల్లిదండ్రులకు అవగాహన లేదు. దీనిపై ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రచారమూ నిర్వహించలేదు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు ఉంటాయనే సమాచారం పేద తల్లిదండ్రులకు చేరువకాలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాలను, వలంటీర్ల వ్యవస్థను దీనికి ఉపయోగించలేదు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు చట్టం అమలు చేస్తామని నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి, సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను భాగస్వామ్యం చేస్తే ఫలితాలు ఎంతో మెరుగ్గా ఉండేవి. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాబోయే విద్యా సంవత్సరంలోనూ విద్యాహక్కు చట్టం పటిష్ఠంగా అమలుకు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎన్నికల్లో గెలవాలంటే
మనం దర్శించాల్సింది బాబాల్ని, పూజారుల్ని
కాదేమో? ప్రజలనేమో?

పదోతరగతి విద్యార్థి దారుణ హత్య

- బాపట్ల జిల్లాలో అమానుషం
- పెట్రోలు పోసి నిప్పు పెట్టిన దుండగులు
- చికిత్స పొందుతూ బాలుడి మృతి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : బాపట్ల జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. స్వల్ప వివాదంపై కక్షపెంచుకున్న దుండగులు దారికాచి అడ్డగించి పదోతరగతి విద్యార్థిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స

- మిగతా 2 లో

జగనన్నకు చెపుదాం రండి...

'చలో గుడివాడ' భగ్నం

విజయవాడలో ఉద్రిక్తత, సీపీఐ నేతల అరెస్టు

అరెస్టయిన నాయకులకు రామకృష్ణ పరామర్శ

విశాలాంధ్ర-విజయవాడ: విజయవాడ నగరంలో శుక్రవారం ఉద్రిక్తత నెలకొంది. సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన జగనన్నకు చెపుదాం రండి చలో గుడివాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. సీపీఐ కార్యాలయం దాసరి భవన్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడ నుంచి రైలులో గుడివాడ చేరుకోవటానికి బయలుదేరిన సీపీఐ నేతలను మార్గమధ్యమంలో అడ్డుకుని బలవంతంగా అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా గుడివాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనపరుస్తున్న సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో కూడా టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని కోరుతూ నేరుగా సీఎంకు విజ్ఞప్తి చేయటానికి టిడ్కో లబ్ధిదారులతో కలిసి సీపీఐ నాయకులు గుడివాడ బయలుదేరారు. ముందుగా లబ్ధిదారులు, సీపీఐ నాయకులు దాసరి భవన్ వద్దకు

- మిగతా 2 లో

తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం

- పెద్ద ఎత్తున ఆస్తి నష్టం
- గోవిందరాజస్వామి రథం భద్రం

3లో

41 ఉపగ్రహాలను ప్రయోగించిన చైనా

బీజింగ్: చైనా ఒకేసారి 41 ఉపగ్రహాలను ప్రయోగించింది. లాంగ్ మార్చ్ 2డీ రాకెట్ ద్వారా 41 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించింది. ఈ ప్రయోగంతో చైనా కొత్త రికార్డును నెలకొల్పింది. ఒకే మిషన్‌లో 41ఉపగ్రహాలను పంపడం ఇదే తొలిసారి. షాంగ్జి ప్రావిన్సులో ఉన్న తైయువన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి రాకెట్‌ను ప్రయోగించారు. లాంగ్ మార్చ్ రాకెట్ సిరీస్‌లో ఇది 476వ ఫ్లయిట్ మిషన్ కావడం విశేషం. చైనా ప్రయోగించిన శాటిలైట్లు.. కమర్షియల్ రిమోట్ సెన్సింగ్ సర్వీసులను కల్పించనున్నాయి. ఆ శాటిలైట్లలో 36 జిలిన్-1 సిరీస్‌కు చెందినవి. ఇప్పటి వరకు చైనా మొత్తం 108 జిలిన్-1 శాలిలైట్లను ప్రయోగించింది. తొలిసారి జిలిన్-1 శాటిలైట్‌ను 2015లో చైనా ప్రయోగించింది. ఆ శాటిలైట్ బరువు సుమారు 420 కేజీలు ఉంటుంది. ప్రస్తుతం ఆ శాటిలైట్ల బరువు

కేవలం 22 కిలోలు మాత్రమే. కొన్ని రోజుల క్రితమే చైనా ముగ్గురు వ్యోమగాముల్ని స్పేస్ స్టేషన్‌కు పంపింది.

వాతావరణ చర్యలను వేగవంతం చేయాలి

ఐరాస: వాతావరణ లక్ష్యాలను చేరుకునే ఎజెండా బలహీనపడుతోంది. వాతావరణ మార్పులను పరిష్కరించడానికి చర్యలను వేగవంతం చేయాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ గురువారం పిలుపునిచ్చారు. న్యూయార్క్‌లోని యుఎన్ ప్రధాన కార్యాలయంలో వాతావరణంపై విలేకరుల సమావేశంలో గుటెర్రెస్ మాట్లాడుతూ వాతావరణ లక్ష్యాలను చేరుకోవడంలో ప్రపంచం బ్యాక్‌ట్రాకింగ్‌పై ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంపై వాగ్దానాలు, నియమాలు, కట్టుబాట్లను నెరవేర్చడంలో దేశాలు వెనుకడుగువేస్తున్నాయని అన్నారు. వాతావరణ ఎజెండా బలహీన పడుతోందన్నారు. గ్లోబల్ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడం ఇప్పటికీ సాధ్యమే. దీనిని మనం ఆశావాహదృక్పథంతో అమలు చేయాలని పిలుపునిచ్చారు. తాను వాతావరణ సౌహార్ద్రత ఒప్పందాన్ని ప్రతిపాదించానని, అదనపు వాతావరణ

మెరుగుదలకుగాను ఎజెండాను ముందుకు తెచ్చానని గుటెర్రెస్ చెప్పారు. ఈ ఒప్పందంలో శిలాజ ఇంధనపరిశ్రమలు, ప్రభుత్వాలు తమ కట్టుబాట్లను నెరవేర్చాలని గుటెర్రెస్ సూచించారు. పునరుత్పాదకతలో పెట్టుబడులను అనుమతించడానికి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆర్థిక సహకారాన్ని అందించడానికి వారు బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల అవసరాన్ని గుటెర్రెస్ నొక్కి చెప్పారు. ప్రపంచంలోని శిలాజ ఇంధనాలను న్యాయమైన రీతిలో పునరుత్పాదకలో పెట్టుబడులుగా పెంచాలని గుటెర్రెస్ సూచించారు.

జర్మనీలో నాటో బలప్రదర్శన



బెర్లిన్ : 25 దేశాల నుండి 250 కంటే ఎక్కువ విమానాలు జర్మనీ గగనతలంలో 'ఎయిర్ డిఫెండర్ 23' పేరుతో వైమానిక దళ విస్తరణను ప్రారంభించాయి. నాటో నిర్వహిస్తోన్న ఈ బలప్రదర్శన, విన్యాసాలపై విమానయాన సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అతిపెద్ద నాటో వైమానిక దళ విస్తరణ వ్యాయామం 'ఎయిర్ డిఫెండర్ 23' జర్మనీ గగన తలంలో మే 12 సోమవారం నుండి ప్రారంభమైంది. ఈ సైనిక విన్యాసాలు జూన్ 23 వరకు కొనసాగనున్నాయి. 25 దేశాలు ఫైటర్‌జెట్‌లు, బాంబర్లు, కార్గో విమానాలలో ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. 250 యుద్ధ విమానాలతో పాటు 10,000 మంది సైనికులు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. జర్మనీ గగనతలంలో చేపడుతున్న ఈ విన్యాసాలు ప్రయాణికుల విమానాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని జర్మన్ ఎయిర్ ట్రాఫిక్ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ఈ విన్యాసాలతో సుమారు 800 ప్రయాణికుల విమానాలను దారి మళ్లించాల్సి వచ్చిందని.. దీంతో వాటిలో 40 శాతం విమానాలు 110 కి.మీ అధిక దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలుస్తోంది. విమానాల ఆలస్యం, అధిక దూరం ప్రయాణంతో రెండు వారాల్లో చాలా మంది ప్రయాణికులు టికెట్లను రద్దు చేసుకునే అవకాశం ఉంది. ఉక్రెయిన్ సంక్షోభం సమయంలో రష్యాను బెదిరించేందుకు నాటో ప్రతీకార చర్యగా సైనిక బలాన్ని ప్రదర్శిస్తోంది. ఈ సైనిక విన్యాసాలను నిరసిస్తూ స్థానికులు వీధుల్లో ప్రజలు ఆందోళనకు దిగారు. ఇతరులను భయపెట్టేందుకు నాటో దేశాలు తమ సైనిక బలాన్ని ప్రదర్శించడం తప్పుడు సంకేతమని ఆందోళనకారుల్లో ఒకరైన థామస్ వెఫింగ్ మండిపడ్డారు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఆయుధాలతో కాదని వెఫింగ్ పేర్కొన్నారు

అట్టుడుకుతున్న ఇంఫాల్

ఇంఫాల్/కొచ్చి : ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో హింసాత్మక, విధ్వంసక పరిస్థితి కొనసాగుతోంది. భద్రతా బలగాలతో అల్లరి మూకలు ఘర్షణలకు దిగుతున్నాయి. అల్లర్లు తార స్థాయికి చేరుకున్నాయి. కొందరు గుర్తుతెలియని దుండగులు ఇంఫాల్‌లో ఉన్న కేంద్ర మంత్రి రాజ్ కుమార్ రంజన్ సింగ్ ఇంటికి శుక్రవారం తెల్లవారుజామున నిప్పు పెట్టారు. ఈ ఘటన జరిగిన సమయంలో కేంద్ర మంత్రి ఇంట్లో లేరని అధికారులు తెలిపారు. అయితే సెక్యూరిటీ గార్డులు, అగ్నిమాపక సిబ్బంది ఆ మంటలను నియంత్రించారు. గురువారం మధ్యాహ్నం ఇంఫాల్ పట్టణం నడిబొడ్డున మణిపూర్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఒక గుంపు మధ్య జరిగిన ఘర్షణలు జరిగాయి. రెండు ఇళ్ల దగ్ధం తర్వాత ఈ పరిణామం జరిగింది. షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) విభాగంలో చేర్చాలనే డిమాండ్‌పై మణిపూర్‌లో కొంత కాలంగా రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. గురువారం అల్లరి మూకల గుంపు భద్రతా బలగాలతో ఘర్షణకు దిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిణామాలపై కేంద్ర మంత్రి ఆర్.కె.రంజన్ సింగ్ పీటీఐతో మాట్లాడుతూ 'నిన్న రాత్రి మణిపూర్‌లోని నా నివాసంలో ఒక సంఘటన జరిగింది' అని తెలిపారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొచ్చిలో ఉన్న మంత్రి మాట్లాడుతూ 'మే 3 నుంచి (రాష్ట్రంలో జాతి ఘర్షణలు ప్రారంభమైనప్పుడు) శాంతిని నెలకొల్పడానికి, హింసను అరికట్టడానికి నేను ప్రయత్నిస్తున్నాను. ఇదంతా రెండు వర్గాల మధ్య అవగాహన లోపం. ప్రభుత్వం శాంతి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజా సంఘాల నేతలు కలిసి చర్చిస్తుంది. ప్రభుత్వం అన్ని వర్గాలతో మాట్లాడి పరిష్కార మార్గం కనుగొంటుంది' అని సింగ్ అన్నారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలో బుధవారం తెల్లవారుజామున తొమ్మిది మంది పౌరులను చంపినందుకు నిరసనగా కోపంతో ఉన్న స్థానికులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు అనేక రౌండ్లు భాష్ప వాయు గోళాలు, మాక్ బాంబులను కాల్చడంతో శుక్రవారం తెల్లవారుజాము వరకు కాల్పుల శబ్దం వినిపించింది. ఈ ఘర్షణలో ఇద్దరు నిరసనకారులు, ఒక ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది గాయపడ్డారు. ఆర్ఏఎఫ్ కానిస్టేబుల్ తలపై రాయి తగిలిందని అధికారులు తెలిపారు. నోంగ్‌మీబుంగ్, వాంగ్‌ఖీ వద్ద నిరసనకారులు రాళ్లు, నిర్మాణ సామగ్రిని పోగు చేయడం ద్వారా ప్రధాన వీధులను దిగ్బంధించారు. భద్రతా దళాలతో ఘర్షణలకు దిగారని వారు వివరించారు. మణిపూర్‌లోని మైతేయి, కుకీ సామాజిక వర్గాల ప్రజల మధ్య బుధవారం జరిగిన ఖమెన్‌లోక్ ప్రాంతంలో 9 మందితో సహా జాతి హింసలో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

సొంత రాష్ట్రానికి బయలుదేరిన కేంద్ర మంత్రి రంజన్

మణిపూర్‌లోని తన ఇంటికి హింసాత్మక గుంపు నిప్పు పెట్టడంతో విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఆర్.కె.రంజన్ సింగ్ ఇక్కడ జరగాల్సిన అన్ని కార్యక్రమాలను శుక్రవారం రద్దు చేసుకున్నారు. ఈశాన్య రాష్ట్రంలో జరిగిన ఘర్షణలు మతపరమైనవి కాదని, రెండు వర్గాల మధ్య ఏర్పడిన అపార్థం వల్లే జరుగుతున్నాయని అన్నారు. తన సొంత ఇంటిని ఒక గుంపు తగలబెట్టిందని, ఇది మతపరమైన సమస్య కాదని సింగ్ అన్నారు. 'నా సొంత ఇల్లు కాలిపోయింది. అది నా చెమట... కష్టపడి సంపాదించిన డబ్బు. ఇది ఏదైనా మతపరమైనదైతే, నేను హిందువును. దాడి చేసినవారు హిందువులే. ఇది మతపరమైనది కాదు. ఇది ఒక గుంపు' అని సింగ్ ఇక్కడ మీడియాతో అన్నారు. బీజేపీ నాయకుడు కూడా అయిన సింగ్, ఈ ఘటనతో కేరళలో తన పార్టీ కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని తన సొంత రాష్ట్రానికి వెళ్లిపోయారు.

ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్

(మొదటిపేజీ తరువాయి)

సాయి పాల్గొన్నారని తెలిపారు. ఎంపీ కుమారుడు శరత్ ఇంట్లోకి వెళ్లి ఆయనను కట్టేసి కత్తితో బెదిరించారు. మరుసటి రోజున ఎంపీ భార్య జ్యోతిని కుమారుడు శరత్‌తో పిలిపించారు. తర్వాత ఆమెను కూడా కట్టేశారు. ఆడిటర్ జీవీ వస్తే ఆయన్ను కూడా కట్టేసి బెదిరించారని డీజీపీ వివరించారు. తొలుత శరత్ ఇంట్లో ఉన్న రూ.15 లక్షలు తీసుకున్నారని, మరో రూ.60 లక్షలను ఖాతా నుంచి బదిలీ చేయించుకున్నారని, ఆడిటర్ జీవీని కొట్టి బెదిరించి రూ.కోటి వరకు తెప్పించుకున్నారని వివరించారు. కిడ్నాప్ గురించిన సమాచారం అందగానే పోలీసులు గంటల్లోనే నిందితులను పట్టుకున్నారని తెలిపారు. కిడ్నాపర్లు రుషికొండ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందింది. అప్పటివరకు బాధితులను కిడ్నాపర్లు డబ్బులు డిమాండ్ చేస్తూ వచ్చారు. పోలీసులు వెంబడిస్తున్నట్లు తెలిసి... ఎంపీ భార్య, కుమారుడు, ఆడిటర్ జీవీతో పాటు కారులో పరారయ్యేందుకు యత్నించగా వారిని పోలీసులు ఛేజ్ చేశారు. అదే సమయంలో పద్మనాభం ప్రాంతంలో కిడ్నాపర్ల కారు ఆగిపోవడంతో ముగ్గురు బాధితులను అక్కడే వదిలేసి కిడ్నాపర్లు పరారయ్యారని డీజీపీ తెలిపారు. తర్వాత వాళ్లను పట్టుకున్నట్లు చెప్పారు. కిడ్నాపర్ల నుంచి రూ.86 లక్షల నగదును కూడా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సరిగా లేవని వస్తున్న వార్తలను డీజీపీ ఖండించారు. ఈ ఘటనను శాంతిభద్రతలకు ముడిపెట్టడం సరికాదన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లలో నేరాలు తగ్గుముఖం పట్టాయని అన్నారు. విశాఖ పోలీసులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారంటూ డీజీపీ కితాబిచ్చారు. ఎంపీకి సెక్యూరిటీ ఉంటుంది కానీ, ఎంపీ కుమారుడికి ఎందుకుంటుందని ప్రశ్నించారు. కిడ్నాప్ వ్యవహారం ఎంపీ చెబితేనే తమకు తెలిసిందన్నారు. కిడ్నాప్ విషయం ఎంపీకి ముందుగా తెలుసా? అన్న ప్రశ్నకు ఆయననే అడగాలని అడగాలంటూ మీడియాకు డీజీపీ సూచించారు. కిడ్నాప్ విషయం ఎంపీకి ఎప్పుడు తెలిసిందనే అంశంపై ఇంకా విచారణ చేయలేదని రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఎంవీవీ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన హేమంత్‌కుమార్ గతంలో మూడు కిడ్నాప్‌లు చేశాడన్నారు. నాలుగేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ మహిళా నగర అధ్యక్షురాలిగా పని చేసిన భోగసముద్రం విజయారెడ్డిని అక్కయ్యపాలెంలో ఆమె ఇంట్లోనే చంపేశాడు. ఆ కేసు విచారణ ఇంకా కొనసాగుతోంది. హేమంత్‌పై నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, కిడ్నాప్‌లకు సంబంధించి 12 కేసులు ఉన్నాయి. ఓ కిడ్నాప్ కేసులో జైలుకు వెళ్లిన హేమంత్ ఇటీవలే బెయిల్‌పై బయటకు వచ్చాడు.

వీరిపైన పీడీ యాక్టు పెట్టి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో మూడు నెలల్లో శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖ నగరాన్ని రౌడీషీటర్లు భాగాలుగా విభజించుకుని గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరా చేస్తున్నట్లు వస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు.

'చలో గుడివాడ' భగ్నం

(మొదటిపేజీ తరువాయి)

చేరుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ గుడివాడ ప్రజలు చేసుకున్న పుణ్యం ఏమిటి? విజయవాడ ప్రజలు చేసుకున్న పాపం ఏమిటి? అని ప్రశ్నించారు. విజయవాడ, జగ్గయ్యపేట, తిరువూరు నందిగామ ప్రాంతాల్లో వేలాది ఇళ్లు నిర్మించి వాటిని లబ్దిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. చలో గుడివాడ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా సీపీఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం నిర్మించి టిడ్కో ఇళ్లను ఇప్పటి వరకు ఇవ్వకపోవటం దుర్మార్గం అన్నారు. వైసీపీ వచ్చిన నాలుగేళ్లలో టిడ్కో ఇళ్లు ఇవ్వాలని సీపీఐ అనేక రూపాల్లో ఆందోళనలు చేసిందన్నారు. 90శాతం పూర్తైన ఇళ్లకు మిగిలిన 10శాతం పూర్తి చేసి ఇవ్వటానికి జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటం దారుణం అన్నారు. అనంతరం ర్యాలీగా బయలుదేరిన నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి కృష్ణలంక పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో శంకర్, కోటేశ్వరరావుతోపాటు సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శి వర్గసభ్యులు బుట్టి రాయప్ప, కేవీ భాస్కరరావు, తాడి పైడియ్య, మూలి సాంబశివరావు,

పంచదార్ల దుర్గాంబ, నగర కార్యవర్గ సభ్యులు డి.వి.రమణబాబు, కొట్టు రమణారావు, తూనం వీరయ్య, దుగ్గిరాల సీతారావమ్మ, ఏఐవైఎఫ్ నాయకులు లంకా గోవింద రాజులు, లంకే సాయి ఉన్నారు.

రామకృష్ణ పరామర్శ:చలో గుడివాడ కార్యక్రమాన్ని అడ్డుకుని అరెస్టు చేసి కృష్ణలంక పోలీస్‌స్టేషన్ ఉంచిన సీపీఐ నాయకులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. ప్రభుత్వమే ప్రజా సమస్యలను చెప్పటానికి జగనన్నకు చెపుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. జగనన్నకు చెపుదామని వెళుతుంటే అడ్డుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రామకృష్ణ తప్పుబట్టారు.

విశాఖలో ఎంపీ కుటుంబం కిడ్నాప్ ఘటనపై

రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలి

విశాలాంధ్ర-విజయవాడ : విశాఖపట్నంలో అధికార పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుని కుటుంబం కిడ్నాప్ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విశాఖ మహా నగరంలో రౌడీ మూకలు పెచ్చరిల్లిపోతున్నాయని, శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నంలో గురువారం జరిగిన సంఘటన రాష్ట్రంలో దిగజారిపోతున్న శాంతిభద్రతలకు పరాకాష్ట అన్నారు. సాక్షాత్తూ అధికార పార్టీ పార్లమెంటు సభ్యుని భార్యను, కొడుకుని, ఆడిటర్‌ను కిడ్నాప్ చేసి, కొట్టి డబ్బులు వసూలు చేశారంటే రౌడీయిజం ఎంతగా పెచ్చరిల్లుతుందో అర్థమవుతోందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో అల్లరిమూకల ఆగడాలు, రౌడీయిజం నానాటికీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలో ఇన్ని దురాగతాలు జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఒక పక్క అమరావతి రాజధానిని విధ్వంసం చేశారని, మరోపక్క రిషికొండకు బోడిగుండు కొట్టించారని విమర్శించారు. విశాఖలో అనేక భూకబ్జాలు జరుగుతున్నాయని తెలిపారు. విశాఖను రాజధానిగా పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విశాఖలో శాంతిభద్రతలు కాపాడడంపై దృష్టిపెట్టడం లేదని అన్నారు. పోలీసులు ప్రతిపక్షాల పైన అయినదానికీ, కానిదానికీ గృహ నిర్బంధాలు, అరెస్టులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాధనంతో జీతాలు తీసుకుంటున్న పోలీసులు సీఎం జగన్‌కు వందిమాగధులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణను విస్మరిస్తున్నారన్నారు. పర్యవసానంగానే విశాఖపట్నంలో ఈ ఘటన జరిగిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి దీనికి బాధ్యత వహించాలని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఇప్పటికైనా పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

పొందుతూ మృతిచెందాడు. రేపల్లె నియోజకవర్గంలోని చెరుకుపల్లిలో జరిగిన ఈ అత్యంత దారుణ ఘటన జిల్లా ప్రజలను కలవరపాటుకు గురిచేసింది. వివరాల్లో కెళితే... చెరుకుపల్లి మండలం రాజోలుకు చెందిన విద్యార్థి అమర్నాథ్.. ఉదయం ట్యూషన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా... మార్గమధ్యలో వెంకటేశ్వరరెడ్డితో పాటు మరో ముగ్గురు యువకులు సైకిల్‌ను అడ్డగించి అమర్నాథ్‌ను తీవ్రంగా కొట్టారు. అనంతరం కాళ్లు కట్టేసి పెట్రోలు పోసి నిప్పంటించారు. తీవ్రంగా గాయపడిన అమర్నాథ్ హాహాకారాలు చేయడంతో సమీపంలో ఉండేవారు వచ్చి చూసి బంధువులకు సమాచారమిచ్చారు. తీవ్రంగా గాయపడిన అమర్నాథ్‌ను వెంటనే గుంటూరులోని జీజీహెచ్‌కు తరలించగా... చికిత్స పొందుతూ కన్నుమూశాడు. రాజోలు పంచాయితీ ఉప్పలవారిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి ఉప్పల అమర్నాథ్ తండ్రి మరణించగా తల్లి, తాత సంరక్షణలో అక్కతో పాటు చదువుకుంటున్నాడు. తన అక్కను అదే గ్రామానికి చెందిన బాల వెంకటేశ్వర రెడ్డి తరచూ వేధిస్తుండటంతో మృతుడు అనేకసార్లు అక్కను వేధించొద్దని చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ట్యూషన్‌కు వెళుతున్న అమర్నాథ్‌ను మార్గమధ్యలో ఆపి తన స్నేహితులతో కలిసి తీవ్రంగా దాడి చేసి అనంతరం పెట్రోల్ పోసి తగులపెట్టాడని మృతుని తల్లి మాధవి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితులను పట్టుకుంటామని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. ఇది ఇలా ఉండగా మృతి చెందిన బాలుడు కుటుంబానికి సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ సంఘీయులందరూ రాజోలు వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు తీసుకున్నారు. మృతుని కుటుంబానికి స్థానిక శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ సంతాపం తెలిపి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని నిందితులకు శిక్ష పడే వరకు ఉపేక్షించేది లేదని తెలిపారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమిస్తాం

బీసీ విద్యార్థి మృతి ఘటనపై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే తాము ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రకటించారు. విద్యార్థిని అడ్డగించి పెట్రోల్ పోసి తగలబెట్టిన దుర్ఘటనపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి తమ అండదండలు ఉంటాయని తెలిపారు. హత్య చేసినవారికి ఉరిశిక్ష వేయాలన్నారు. ప్రభుత్వం సరిగ్గా ఈ విషయంపై వ్యవహరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం ఉద్యమిస్తుందన్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ వకూల్ జిందాల్, డిఎస్పీ, సీఐలతో తాను మాట్లాడానని జరిగిన సంఘటనపై దర్యాప్తు సరిగా లేకుంటే సహించబోమని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా న్యాయసలహాదారుడు అంగలకుదురు నటరాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర్లు, వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు మురాల వాసుదేవ్, జిల్లా కార్యదర్శి ఈడే శ్రీనివాసరావు, బాపట్ల పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్, బీసీ నేతలు యశోదకృష్ణ శివప్రసాద్, నారాయణ, రఘురామయ్య ఉన్నారు.

ఆర్థిక పరిస్థితిపై చర్చకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారి అన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, ఆదాయం లేదంటూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు బాధ్యతా రాహిత్యమని బుగ్గన విమర్శించారు. పాలన రాకపోతే గడచిన నాలుగేళ్లుగా పన్ను వసూళ్లు ఎలా పెరుగుతున్నాయని ప్రశ్నించారు. ఎప్పుడో ఒకసారి మాత్రమే వేతనాలు ఆలస్యం అయ్యాయని, దానిని బూచిగా చూపడం తగదన్నారు. కోవిడ్ కష్టాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నప్పటికీ ఏపీలో మాత్రం ఎక్కడా సామాజిక పెన్షన్లు ఆలస్యం కాలేదన్నారు. అలాగే ఏపీ ఆర్థిక పరిస్థితిపై విపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు చెరొకరకంగా మాట్లాడుతున్నారని బుగ్గన విమర్శించారు. ఆర్థిక పరిస్థితిపై వారిద్దరితోనూ బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. సంక్షేమ పథకాలు ఇస్తే ఉచితాలు అంటున్నారని, టీడీపీ ఇచ్చిన హామీలు ఉచితాలు కావా అని ప్రశ్నించారు. తమ కంటే ఎక్కువ ఇస్తామని ఇప్పుడు ఎలా చెబుతున్నారని బుగ్గన ప్రశ్నించారు. పారిశ్రామికాభివృద్ధిలో కూడా ముందంజలో ఉన్నామని, ఏటా రూ.11 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. దీనిపై యనమల స్పందిస్తూ మంత్రికి ప్రతి సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి బహిరంగ చర్చకు వస్తే... మేం సిద్ధమని గతంలోనే చెప్పామని, దానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. చర్చకు రమ్మని చెప్పిన ముఖ్యమంత్రి ఎందుకు బయటకు రావడం లేదని ప్రశ్నించారు. ఎప్పుడో ఒకసారి బయటకు వచ్చి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పి వెళ్లిపోవడం కాదు... దమ్ముంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయమంతా అప్పుల ద్వారానే అని, టీడీపీ హయాంలో పెట్టుబడులు, పరిశ్రమల రాకతో ఆదాయం సమకూరితే, ప్రస్తుతం అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విభజన సమస్యలు వెంటాడుతున్నప్పటికీ ఐదేళ్లలో చేసిన అప్పు రూ.1.86 లక్షల కోట్లు మాత్రమేనని, అదే జగన్ రెడ్డి నాలుగేళ్లలో చేసిన అప్పు రూ.7 లక్షల కోట్లు అని వివరించారు.

ఇక టీడీపీ ఐదేళ్లలో రూ.3 లక్షల కోట్లు సంక్షేమానికి చేశామని, పోలవరం 72 శాతం పూర్తి చేశామని, పట్టిసీమ సహా 32 సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని, నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టామని, అమరావతిలో రూ.2 లక్షల కోట్ల సంపద సృష్టించామని చెప్పారు. కానీ, ప్రస్తుతం జగన్ రెడ్డి ఏం చేస్తున్నారు... రోజూ ఆర్బీఐ ముందు అప్పుల కోసం మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఎర్రచందనం, ఇసుక, మద్యం, గంజాయి, డ్రగ్స్‌తో రాష్ట్రాన్ని లూటీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. చివరికి మద్యం అమ్మకాలను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకున్న దిక్కుమాలిన పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని అన్నారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను, మరుగుదొడ్ల పన్నులతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారని, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిజంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని, ఆదాయం పెరిగిందని, గతంలో కంటే అప్పులు తగ్గాయనే నమ్మకం ఉంటే... జగన్ రెడ్డి చర్చకు రావాలని యనమల డిమాండ్ చేశారు.

ఏపీలో అగ్నివర్షం

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ ఎండీ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సుమారు 264 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 214 మండలాల్లో వడగాల్పులుంటాయని, ఆదివారం 42 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 203 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మరోవైపు అక్కడక్కడా ఈదురు గాలులతో కురిసే వర్షాలతో పాటుగా పిడుగులు పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీమ నుంచి ముందుకురాని రుతుపవనాలు

గత రెండు వారాలుగా రుతుపవనాల కోసం ఎదురుచూస్తున్నా... తొలకరి మాత్రం రైతులను పలకరించడం లేదు. వాస్తవానికి ఈనెల 11వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశించిన రుతుపవనాలు రాయలసీమ నుంచి ముందుకు కదలడం లేదని వాతావరణ శాఖ అధికారులు చెపుతున్నారు. శ్రీహరికోట, కర్నాటకలోని రత్నగిరి ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు నిలిచిపోయినట్లు తెలిపారు. జూన్ 18వ తేదీ మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది.

అక్కడి నుంచి ఆయా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని అంచనా వేస్తోంది. అదే రోజు మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుందని, 18వ తేదీ సాయంకాలం, రాత్రి సమయం నుంచి వర్షాలు మొదలవుతాయని వెల్లడించింది. గుంటూరు, కృష్ణాతో పాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

పట్టెడన్నమూ కష్టమే

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం కోటాలో 323.22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఉండగా ఈ ఏప్రిల్‌లో 248.60 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నాయి. 2022 ఏప్రిల్‌లో 189.90 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు ఉండగా, ఈ ఏప్రిల్‌లో 83.45 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉన్నాయి. బియ్యం, ఆహార ధాన్యాల కొరతకు ఈ లెక్కలే నిదర్శనం.

విపరీతంగా పెరిగిన ధరలు: ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగి పేదలకు పెనుభారంగా మారడం బీజేపీ హయాంలో సాధారణ అంశంగా మారిపోయింది. ఇటీవల వంట నూనెలు, కంది పప్పు ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పుడు గోధుమలు, బియ్యం ధరలు భారీగా పెరుగుతున్నాయి. కేంద్రం లెక్కల ప్రకారమే... గత నెల రోజుల్లో మార్కెట్‌లో గోధుమల ధరలు 8.13 శాతం పెరిగాయి. అధికార లెక్కల ప్రకారం ఏడాదిలో బియ్యం ధరలు 10 శాతం పెరిగాయి. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఈ ధరలు మరింత ఎక్కువే పెరిగాయి.

ఓఎంఎస్ఎస్‌పైనా షరతు

ఎఫ్‌సీఐ నుంచి ఈ-వేలంలో పాల్గొనాల్సిన అవసరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార ధాన్యాలను కొనుగోలు చేసుకునేందుకు కేంద్రం ఓఎంఎస్ఎస్ ద్వారా అవకాశం కల్పిస్తూ జనవరి 26న నిర్ణయం తీసుకుంది. కానీ ఈ నిర్ణయం జరిగి ఆరు నెలలు కూడా గడవక ముందే కేంద్రం మాట మార్చింది. ఇప్పుడు ఓఎంఎస్ఎస్ నుంచి ఈశాన్య రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలను తొలగించాలని ఎఫ్‌సీఐను కేంద్రం ఆదేశించింది. చాలా రాష్ట్రాలు సొంతంగా పేదలకు ఆహార ధాన్యాలు అందించే పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ పథకాల కోసం సరిపడా నిల్వలు లేని రాష్ట్రాలు ఎఫ్‌సీఐ నుంచి కొంటాయి. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ పథకాల అమలుకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది.

కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

అధికారుల లెక్కల ప్రకారం మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏప్రిల్‌లో 5.23 లక్షల హెక్టార్లలో గోధుమ పంట నష్టం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో దిగుబడులు తగ్గుతున్నందున ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, కేంద్రం చేతులు ముడుచుకొని కూర్చున్నది. ఫలితంగా గోధుమల కొరత ముంచుకొస్తున్నది. ప్రస్తుతం గోధుమలపై దిగుమతి సుంకం 40 శాతం ఉన్నది. దీంతో వ్యాపారులు ఇతర దేశాల నుంచి గోధుమల దిగుమతికి వెనకాడుతున్నారు.

'ఆర్టీఈ' సీట్లు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలు, అధికారులు, విద్యార్థి తల్లిదండ్రులు, మేధావులు, విద్యార్థి సంఘాలు కృషి చేయాల్సిన అవసరముంది. కేంద్ర ప్రభుత్వ చట్టం ద్వారా రూపొందించిన ఆర్టీఈ చట్టాన్ని అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది.

కార్పొరేట్‌కు అధికారుల వత్తాసు?

ఆర్టీఈ 2009 చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసినప్పటికీ, విద్యాశాఖ యంత్రాంగం అంత చొరవ చూపడం లేదనే ప్రచారముంది. కార్పొరేట్ యాజమాన్యానికి అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు విమర్శలున్నాయి. రెండేళ్ల నుంచి ఈ చట్టం అమలవుతున్న తీరే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చుకుని విచ్చలవిడిగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యం సిండికేట్‌గా మారి, ఈ చట్టం అమలు కాకుండా గతంలో న్యాయస్థానాలను ఆశ్రయించి అడుగడుగునా ప్రభుత్వ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించిన విషయం విదితమే. దానిపై జగన్ ప్రభుత్వమూ బలంగా ఎదుర్కొని ఎట్టకేలకు ఆర్టీఈను గాడిలో పెట్టినా కూడా సత్ఫలితాలు రావడం లేదు. రాష్ట్రంలోని గుంటూరు, నెల్లూరు, విజయవాడ, ఏలూరు, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల్లోని పేరొందిన ప్రైవేట్ సీబీఎస్ఈ పాఠశాలల వివరాలను జాబితా నుంచి తొలగించినట్లు తెలిసింది. ఆది నుంచి ప్రైవేట్ యాజమాన్యానికి కింది స్థాయిలోని విద్యాశాఖ యంత్రాంగం కొమ్ము కాయడంతోనే విద్యా వ్యవస్థ విచ్ఛిన్నమవుతోంది. పేద పిల్లల చదువులపై రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలును సమర్థంగా కొనసాగించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి.

'ఉపా' కేసు దారుణం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్న మహిళా రెజ్లర్లకు న్యాయం జరగడం లేదని, బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవడం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే బీహార్‌లో జరిగే విపక్షాల సమావేశానికి తెలంగాణ, ఏపీ సీఎంలు కేసీఆర్, జగన్, టీడీపీ నేత చంద్రబాబు హాజరు కావాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు ఆహ్వానించలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. అటు తెలంగాణ సచివాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానం రాలేదని గవర్నర్ అన్నారని, మరి పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదంటే గవర్నర్ దగ్గర సమాధానమూ లేదన్నారు. జగన్ ప్రభుత్వంపై బీజేపీ ఏదో మొక్కుబడిగా మాట్లాడుతోందని, మోదీ ప్రభుత్వానికి జగన్ కట్టుబానిసని, ఆయన్ను బీజేపీ ఎందుకు వదులుకుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితో వెళ్లాలనే దానిపై సీపీఐ ఇంకా నిర్ణయం తీసుకోలేదని నారాయణ తెలిపారు.

తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం

పెద్ద ఎత్తున ఆస్తి నష్టం

గోవిందరాజస్వామి రథం భద్రం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ సమీపంలోని లావణ్య ఫొటో ఫ్రేమ్స్ దుకాణంలో శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణంలో ఉదయం పదిన్నర గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అందులో పని చేస్తున్న సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ దుర్ఘటనలో పెద్ద ఎత్తున ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. సమాచారం అందుకుని రంగంలోకి దిగిన పోలీసులు... చుట్టుపక్కల దుకాణదారులను, హొటళ్లలో వసతి పొందుతున్న భక్తులను ఖాళీ చేయించారు. సమయం గడిచేకొద్దీ మంటలు భారీగా వ్యాపించడం... గోవిందరాజస్వా మి భక్తులను, స్థానికులను ఆందోళనకు గురిచేసింది. ఉవ్వెత్తున ఎగసిన మంటలను అదుపు చేయడం అగ్నిమాపక శాఖ సిబ్బందికీ కష్ట తరమైంది. అగ్నిప్రమాదం జరిగిన భవనంలో దేవతామూర్తులను తయారు చేయడానికి వినియోగించే రసాయనాల కారణంగా మంటలు అధికంగా వ్యాప్తి చెందాయి. గురువారమే కోట్ల విలువైన ముడిసరుకు, ఇతర వస్తువులు దుకాణంలో నిల్వ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో దాదాపు 10 కోట్లకుట్ల పైగా నష్టం వాటిల్లిం దని దుకాణదారులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన భవనానికి సమీపానే గోవిందరాజస్వామి రథం ఉండటం తీవ్ర ఆందోళన కలిగించింది. రథానికి మంటలు అంటుకునే ప్రమాదం ఉందనే ఆందోళనతో తితిదే అధికారులు, సిబ్బంది రంగంలోకి దిగారు. సంస్థకు చెందిన అగ్నిమాపక వాహనాలు, ట్యాంకర్లను ఘటనా స్థలానికి తెప్పించారు. రథం వరకు మంటలు వ్యాపించాయన్న ప్రచారాన్ని టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఖండించారు. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని సుగుణమ్మ ఆరోపించారు. అగ్ని ప్రమాదాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం సరికాదని, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. అగ్నిమాపకశాఖ, టీటీడీ, నగరపాలక సంస్థ సిబ్బంది 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన లావణ్య లామినేషన్ భవనం గోవిందరాజ స్వామి ఆలయం సమీపంలో ఉత్తర మాడవీధి మొదట్లో ఉంటుంది. ఈ వీధి మొదట్లోనే ఓ పక్కగా స్వామివారి రథాన్ని నిలిపి ఉంచుతారు. నిజానికి ఈ రథం చుట్టూ రేకులతో రక్షణ కవచం ఉంటుంది. ఇటీవలే స్వామివారి బ్రహ్మోత్సవాలు జరిగిన నేపథ్యంలో తొలగించిన ఆ రేకులను ఇంకా అమర్చలేదు. దీంతో లావణ్య ఫోటో ఫ్రేమ్ కంపెనీలో అంటుకున్న మంటలు ఈ రథానికి సమీపంలోకి వచ్చాయి. తొలుత స్వామి వారి రథం కూడా కాలిపోయిందన్న ప్రచారం జరిగింది. రథానికి మంటలు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మరో వైపు ఈ అగ్నిప్రమాదం కారణంగా మాఢవీదిలో రాకపోకల్ని నిలిపివేశారు. తొలుత మంటలు అదుపులోకి రాకపో వడంతో మరో నాలుగు ఫైరింజన్లు రప్పించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఫోటో ఫ్రేమ్ ఉన్న భవనంతో పాటు మాడవీధిలో వేసిన చలువ పందిళ్లు, అక్కడ రోడ్డుపై పార్క్ చేసిన కొన్ని బైక్ లు కాలి బూడిదయ్యాయి.

యువతను బాధ్యతల వైపు మరల్చేందుకే...

27 నుంచి గుంటూరులో రాష్ట్రస్థాయి యువజన సమ్మేళనం

ఆహ్వాన సంఘం అధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు: నేటి యువ తరాన్ని తమ బాధ్యతల వైపు మరల్చి... దేశం కోసం... దేశ ప్రజల కోసం త్యాగపూరిత పోరాటాల వైపు సమాయత్తం చేయడానికి గుంటూరులో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు ఏఐవైఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లోని వీఎస్‌కే హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 1,000 మంది యువజన సమాఖ్య కార్యకర్తలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అవగాహన కల్పించడానికి గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. సమాజంలో అణగారిన వర్గాలపై రోజురోజుకి పెరుగుతున్న దాడులు, ప్రభుత్వాలు అవలంభిస్తున్న వికృత పోకడలు, రాజకీయ వ్యవస్థలో నానాటికీ దిగజారుతున్న విలువల స్థానంలో ప్రజా రాజకీయ వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యాన్ని భావితరాలకు వివరించడంతో పాటు సాంస్కృతిక రంగంలో వెర్రితలలు వేస్తున్న విష సంస్కృతి పట్ల యువతను మేల్కొపేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాంస్కృతిక రంగంలో విష సంస్కృతిని నివారించి, దాని స్థానంలో ప్రజలను చైతన్యం చేసే నిజమైన సాంస్కృతిక రంగం ఎలా ఉండాలి... యువజన కార్యకర్తల కర్తవ్యం ఏమిటి... అనే అంశాలను శిక్షణా తరగతులలో వివరించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో కేరళ సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రొఫెసర్ ఖాశిం, వీక్షణం పత్రిక సంపాదకులు, ప్రొఫెసర్ వేణుగోపాల్, సామాజిక తత్వవేత్త సుబ్బరాజు, వందేమాతం శ్రీనివాస్, గోరేటి వెంకన్న తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. సంఘం కోశాధికారి కోట మాల్యాద్రి మాట్లాడుతూ యువత పెడద్రోవపట్టకుండా ఈ సమ్మేళన కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. నాలుగు రోజుల పాటు గుంటూరు నగరంలో జరిగే ఈ కార్యక్రమానికి నగర ప్రజలు ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని కోరారు. అనంతరం సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ వలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి జంగాల చైతన్య, ఉపాధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, కాబోతు ఈశ్వరరావు, గని, కార్యదర్శులు చల్లా మరియదాస్, బందెల నాసర్ జీ, ఆహ్వాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

హక్కుల ఉద్యమనేత ఏసు మృతి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపీడీఆర్) రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు గుండె సంబంధ వ్యాధితో ఇక్కడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన పౌరహక్కుల ఉద్యమ నేతగా ప్రసిద్ధి చెందారు. ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా ఆయన తన జీతంతో మాత్రమే జీవించారు. అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఎందరికో ఆదర్శంగా నిలచారు. ఓపీడీఆర్ ఏసుగా ప్రసిద్ధుడైన ఆయన మరణం హక్కుల ఉద్యమానికి, ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరని లోటని ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.హనుమంతరావు పేర్కొన్నారు. ఏసు అంతిమ యాత్ర 18వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక న్యూగిరిపురంలోని స్వగృహం నుంచి ప్రారంభ మౌతుందని తెలిపారు. ఏసు కమ్యూనిస్టు కుటుంబలో జన్మించారు. ఆయన తండ్రి రాములు ఉమ్మడి కమ్యునిష్టు పార్టీలో చురుకైన పాత్ర నిర్వహించారు. తండ్రి నుంచి కమ్యూనిస్టు భావాలు, ఆదర్శాలను పునికిపుచ్చుకున్న ఏసు కమ్యునిస్టు ఉద్యమంలో పని చేసే క్రమంలో హక్కుల ఉద్యమంలోకి వచ్చారు. తన 74 సంవత్సరాల జీవితకాలంలో 55 సంవత్సరాలు ఉద్యమ జీవితమే. విజయవాడలో న్యూగిరిపురం, అరుళ్ నగర్ తదితర కాలనీల ఏర్పాటులో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. దళితులపై, మహిళలపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా సాగిన ఆందోళనలలోనూ, నిజనిర్ధారణ కమిటీలలోనూ ఆయన ప్రముఖ పాత్ర వహించారు. రాజ్యహింస వ్యతిరేక ప్రజా ఉద్యమ నిర్మాణంలో, రాజ్యం తెచ్చిన నిర్బంధ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలోనూ ఆయన ముఖ్యుడు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమ నిర్మాణంలో ఏసు ముఖ్యపాత్ర వహించారు.

రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తుళ్లూరు: రానున్న ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఎక్కువ ప్రాధాన్య ఇవ్వాలనీ, ప్రత్యేకంగా కౌలు రైతులను భాగస్వామ్యం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. జూన్ 13, 14, 15 తేదీల్లో పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన రైతు సమ్మేళనంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా చర్చించామని చెప్పారు. శుక్రవారం ఆయన తుళ్లూరులో విలేకరులతో మాట్లాడుతూ రైతాంగానికి రైతుబంధు పేరుతో కేంద్ర ప్రభుత్వం రూ.6000, రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500 మొత్తం రూ.13,500 చెల్లిస్తున్నారని అయితే ఈ నామమాత్రపు పెట్టుబడితో ఒక్క ఎకరా కూడా సాగు చేయలేనటువంటి పరిస్థితుల్లో నేడు వ్యవసాయ ఖర్చులు పెరిగిపోయాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుందో అదే పద్ధతిలో ఎకరం వరకు పరిమితమై ఉన్న రైతులకు రూ.20వేల, రెండు ఎకరాలు పైబడిన రైతాంగానికి ఎకరాకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వెబ్‌సైట్‌లో ఈఏపీసెట్ ర్యాంకు కార్డులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్ 2023 ర్యాంకు కార్డులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈనెల 14న ఈఏపీసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేసిన విషయం విదితమే. ఆ ఫలితాలకు సంబంధించిన అభ్యర్థుల ర్యాంకు కార్డులను వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఈఏపీసెట్ రిజిస్ట్రర్ నంబరు, హాల్ టికెట్ నంబరుతో పాటు అభ్యర్థి పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి, ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇంటర్ మీడియట్ తత్సమాన అర్హతతో ఉత్తీర్ణులైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ మార్కుల వివరాలను అప్‌లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించారు.

27న చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశం ఈనెల 27న విజయవాడలోని దాసరి భవన్‌లో జరుగుతుందని, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొంటారని చేతి వృత్తిదారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో చేతివృత్తిదారుల సమస్యలపై సమాఖ్య నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించిన అనంతరం జులై 21న అనంతపురంలో జరిగే రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సును, సెప్టెంబరులో జరిగే గొర్రెల పెంపకం దారుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేసేందుకు ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు ఈ సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర బాబు డిమాండ్

విశాలాంధ్ర-అమలాపురం: రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం అమలాపురం ఎస్‌టీయూ భవన్ నందు ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బందారు బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మించి మోసం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో పాదయాత్రలు చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ప్రకటనలకే పరిమితమైందని, డీఎస్సీ నోటిఫికేషన్ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల 794 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటిస్తే రాష్ట్రంలో 700 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ప్రకటించడం సరికాదని అన్నారు. జూన్ 27, 28, 29, 30 తేదీలలో అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర యువజన, విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం గుంటూరులో నిర్వహిస్తున్నామని, ఈ సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక, నిరంకుశ విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. యువజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐవై ఎఫ్ మాజీ నాయకులు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు మోకా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ బందారు బాలకృష్ణ, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి, ఏఐవైఫ్ జిల్లా నాయకులు నిమ్మకాయ శ్రీనివాసరావు, కాళ్ల భీమరాజు, కామిశెట్టి నాగబాబు, సంపర లక్ష్మణ స్వామి, బాషా రామకృష్ణ, శీలం రాము, బుంగా లోవరాజు, రొక్కాల సత్య నారాయణ బొక్కా చిన్న తదితరులు హాజరయ్యారు.

కారణం తెలియకుండా రవీంద్రనాథ్ హౌస్ అరెస్టు

విశాలాంధ్ర-విజయవాడ: ఏ కారణంతో అరెస్టు చేస్తున్నారో, ఎవరు అరెస్టు చేయమన్నారో తెలియకుండా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వివరాలు రవీంద్రనాథ్ మాటల్లోనే గురువారం అర్ధరాత్రి 12 గంటలకు పోలీసులు కాలింగ్ బెల్లు పదే పదే కొట్టారు. బయటికి వచ్చి చూస్తే పోలీసులు. మిమ్ములను హౌస్ అరెస్టు చేయమని మాపై అధికారులు చెప్పారు సార్. మీరు బయటికి రావద్దండి అన్నారు. దేనికి అరెస్టు చేయమన్నారు. మా ఏఐటీయూసీ కార్యక్రమాలు ఏమీ లేవు. ఏ ఆందోళనలు శుక్రవారం చేయడంలేదని చెప్పాను. ఆ సంగతి మాకు తెలియదు సార్ ఎవరు మీ పై అధికారితో నాకు ఫోన్ కలిపి ఇవ్వండి మాట్లాడతాను అని చెప్పాను. పై అధికారికి ఫోన్ కలిపి ఇచ్చారు. ఆయన సమాధానం కూడ ఏమో తెలియదు సార్. మా పై వారు చెప్పారు అని అన్నారు .మీ పైన ఉన్నది ముఖ్యమంత్రి నా లేక డీజీపీ నా అని అడిగాను. ఉదయం 11గంటల వరకు కూడ నన్ను ఎందుకు హౌస్ అరెస్టు చేశారో,ఎవరు చేయమన్నారో నా దగ్గరికి వచ్చిన కానిస్టేబుల్‌కు తెలియదు. నాకూ తెలియలేదు. ఉదయం 11గంటలకు నాకు తెలిసిన సమాచారం ముఖ్యమంత్రి గుడివాడ కార్యక్రమం ఉన్నందున నగర సీపీఐ ఆ కార్యక్రమానికి హాజరై ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించిందని అందువల్ల నన్ను హౌస్ అరెస్టు చేయమన్నారని. దాదాపు 10గంటల పాటు ఎందుకు, ఎవరు అరెస్టు చేయమన్నారనేది తెలియదు. ఇదీ మన పోలీసుల ప్రభుత్వ పనితీరు. దున్నపోతు ఈనింది అంటే దూడను గాట కట్టేయమన్నట్లు.

జర్నలిస్టులు విలువలతో కూడిన వార్తలు అందించాలి

ఆంధ్రప్రదేశ్ సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని

విశాలాంధ్ర-నరసరావుపేట: పత్రికలు-పాత్రికేయులు విలువలతో కూడిన వార్తలను పాఠకులకు అందించాలని ఆంధ్రప్రదేశ్ రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో శుక్రవారం జరిగిన సీనియర్ పాత్రికేయులు కె.వి.కె.రామారావు, డాక్టర్ మదక సత్యనారాయణ సన్మాన కార్యక్రమంలో కొమ్మినేని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జర్నలిస్టులు-సంపాదకులు వార్తలు రాసేటప్పుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని, జర్నలిజం విలువలను కాపాడాలని కేఎస్ఆర్ కోరారు. దురదృష్టవశాత్తు ప్రస్తుత జర్నలిస్టుల్లో మాఫియాలు ప్రవేశిస్తున్నాయని, వాటిని కట్టడి చేయాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని అన్నారు. మీడియా అకాడమీ అధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలలో జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ కార్డుల నిర్వహణకు ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తున్నామని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీ విషయంలో త్వరలో ప్రభుత్వం మంచి నిర్ణయం ప్రకటిస్తుందని అన్నారు. స్థానిక జర్నలిస్టులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు. నిబద్ధతతో పని చేసే జర్నలిస్టులకు గుర్తింపు ఉంటుందని, అందుకు కె.వి.కె.రామారావు, డాక్టర్ మదక సత్యనారాయణలే ఉదాహరణ అన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ మీడియాలో పని చేస్తున్న వారికి భాషపై పట్టుండాలని, ప్రతి జర్నలిస్టు ఎడిటోరియల్ కాలమ్స్ చదవాలన్నారు. తాను పత్రికలు చదివి సివిల్స్‌కి అర్హత సాధించానని తెలిపారు. పత్రికల్లో ప్రచురితమయ్యే వార్తల వల్లే జిల్లా నలుమూలల్లో జరుగుతున్న సమస్యలను, ప్రజల ఇబ్బందులను తాము తెలుసుకుంటున్నామని, జర్నలిస్టులు వాస్తవ వార్తలను సేకరించి, సమాజానికి ఉపయోగమైన సమాచారాన్ని పాఠకులకు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, అధికారులు వెంటనే సహాయ చర్యల్లో పాల్గొంటారని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు కె.వి.కె.రామారావు, డాక్టర్ మదక సత్యనారాయణలను ఆదర్శంగా తీసుకొని నేటితరం జర్నలిస్టులు నిబద్ధతతో పనిచేసి పేరుప్రతిష్ఠలు పొందాలన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు మాట్లాడుతూ జర్నలిస్టుల అండదండలతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, నిజాయితీగల జర్నలిస్టులకు ఎప్పటికీ గౌరవం ఉంటుందని అన్నారు. నరసరావుపేట జర్నలిస్టులకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తా నన్నారు. వినుకొండలో జర్నలిస్టులందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలం అందజేశానని తెలిపారు. సన్మాన గ్రహీత కె.వి.కె.రామారావు మాట్లాడుతూ నేటితరం జర్నలిస్టులు నిజాయితీతో పని చేయాలన్నారు. విలేకరులకు ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మీడియా అకాడమీ చైర్మన్ కేఎస్ఆర్‌ను కోరారు. సమావేశంలో పల్నాడు జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, మీడియా అకాడమీ కార్యదర్శి తిలక్, ఐ అండ్ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ దీప్తి, డీపీఆర్ఓ ఓం ప్రకాష్ రెడ్డి, ఏపీఆర్ఓ రవికుమార్, ఇందిరా శాస్త్రి, జడ్పీటీసీలు పిల్లి ఓబుల్ రెడ్డి, చిట్టిబాబు, జర్నలిస్టులు ఆర్రురి రమేష్, ప్రసాద్, జగన్‌మోహన్ రెడ్డి, సైకం రమణారెడ్డి, నాగరాజు, రిటైర్డ్ సంస్కృతిక అధ్యాపకులు శ్రీనివాస అయ్యంగార్, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై పోరు

సీపీఐ నేత జగదీశ్ పిలుపు

విశాలాంధ్ర- గుంతకల్లు: రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాలలో ఏడుసార్లు సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల రక్తాన్ని జలగ లా పీలుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ విమర్శించారు. శుక్రవారం స్థానిక బీటీ పకీరప్ప భవనం ఫంక్షన్ హాల్‌లో అన్ని పార్టీల, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ అధ్యక్షతన వహించారు. జగదీశ్ మాట్లాడుతూ సర్దుబాటు చార్జీలు అంటూ ట్రూ ఆఫ్ చార్జీలు పేర్లతో విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై భారాన్ని వేస్తున్నారని విమర్శించారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లంటూ కొత్త విధానాన్ని తీసుకొచ్చి ఒక కోటి 89 లక్షల మంది వినియోగదారులపైన రూ.3500 కోట్ల భారాన్ని వేస్తున్నాడని,37 వేల రూపాయలు ఒక్కొక్క మీటర్ పై వసూలు చేస్తున్నాంన్నారు. పెంచిన చార్జీలు తగ్గింపు ఉద్యమాలతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ భారాలను నిరసిస్తూ 26న మున్సిపల్ కార్యాలయం నుంచి, అజంతా సర్కిల్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన చేపట్టాలని అందుకు అన్ని పార్టీలు, ప్రజలు కలిసి రావాలని జగదీశ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.గోవిందు, కాంగ్రెస్ గుంతకల్ ఇన్చార్జ్ ప్రభాకర్, సీపీఐ నియోజవర్గ సహాయ కార్యదర్శి బి.మహేశ్, టీడీపీ నాయకులు మస్తాన్, జనసేన నాయకులు బండి శేఖర్, సీపీఐ ఎంఎల్ నాయకులు మహబూబ్ బాషా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాస్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రమేష్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెల్లిపోగుల ఆనంద్, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘం నాయకులు ఆలం నవాజ్, జై భీమ్ పార్టీ బాషా తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన పోలీసుల్ని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు: తిరుమలపాలెం లో అంబేద్కర్ విగ్రహం తొలగింపు ఘటనలో అర్ధరాత్రి పోలీసులు... దళితులపై దాడిచేయడం దారుణమని ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి మేజిస్ట్రేట్ విచారణ జరపాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధ్యతా రహితంగా వ్యవహరించిన పోలీసులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. రాష్ట్రంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులు, గిరిజనుల పై అరాచకాలు పెరిగాయన్నారు. వీటిని నివారించటంలో ప్రభుత్వం విఫలమయ్యిందన్నారు. వెంటనే బాధితులను ఆదుకొని, తగు న్యాయం చేయకపోతే డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వ్యాపిత ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు.

వివేక హత్య కేసు విచారణ 30కి వాయిదా

ఆరుగురు నిందితులకు రిమాండ్ పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ కేసుపై శుక్రవారం ఉదయం సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ప్రస్తుతం చంచల్‌గూడా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమా శంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివ శంకర్ రెడ్డి, వైఎస్ భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి మొత్తం ఆరుగురు నిందితులను సీబీఐ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. కోర్టు వీరి రిమాండ్‌ను ఈనెల 30వ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కేసు విచారణను ఈనెల 30కి వాయిదా వేసింది. దీంతో నిందితులను అధికారులు తిరిగి చంచల్ గూడ జైలుకు తరలించారు. జూన్ 30వరకు వివేకా హత్య కేసు దర్యాప్తును ముగించాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. మరోవైపు సీబీఐ కోర్టు కూడా ఈ కేసు విచారణను ఈనెల 30కి వాయిదా వేసిన నేపథ్యంలో ఏం జరుగుతుందా అనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

కంపెనీ కార్యదర్శుల కోర్సుపై అవగాహన పెంచాలి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: కంపెనీ సెక్రటరీ కోర్సుపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. ప్రాక్టీసింగ్ కంపెనీ కార్యదర్శుల 24వ జాతీయ సదస్సు విశాఖపట్నంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కంపెనీ సెక్రటరీ కోర్సు కు సంబంధించి కంపెనీ కార్యదర్శుల అసోసియేషన్ విద్యార్థుల్లో పెద్ద ఎత్తున చైతన్యం తీసుకురావాలని, విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది వారికి ఉపాధి కల్పించే దశగా పనిచేయాలని కోరారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో వాణిజ్య, పారిశ్రామిక సంస్థల అధిపతులు, సీనియర్ కార్పొరేట్ నిపుణులు/డైరక్టర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. విశ్వవ్యాప్తమైన కార్పోరేట్ పాలన సంక్లిష్టతలపై అవగాహన పొందేందుకు, తదనుగుణంగా సామర్థ్యాలను పెంపొందించుటకు ఈ సదస్సు దోహదం చేస్తుందని నిర్వాహకులు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు జీఎస్ గిరిధరన్, ద్వారకనాథ్, సందీప్ కేజ్రీవాల్, ఆసీస్ మోహన్, మనీష్ గుప్తా, నరసింహన్ పాల్గొన్నారు.

సంపాదకీయం

ఉత్తరాఖండ్‌లో ముస్లింల వేట

ఉత్తరాఖండ్ లోని పురోలా ప్రాంతం గత పది పన్నెండు రోజుల నుంచి కుమ్మరి ఆవంలా మారిపోయింది. ఉత్తరాఖండ్‌ను దేవ భూమి అంటారు. అక్కడ హిందువులు తప్ప అన్యమతస్థులు నివసించడానికి వీలులేదని హిందుత్వ వాద సంస్థలైన విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, దేవ భూమి రక్షా అభియాన్ లాంటి సంస్థల వారు అంటున్నారు. ముస్లింల ఇళ్లను ప్రత్యేకంగా గుర్తించి వారిని వెంటనే ఖాళీచేసి వెళ్లిపోవాలని ఒత్తిడి చేస్తున్నారు. ఈ భయానక వాతావరణాన్ని తట్టుకోలేక చాలా మంది ముస్లింలు వెళ్లి పోయారు కూడా. "లవ్ జిహాద్" అన్న మాటను బాగా ప్రచారంలో పెట్టిన హిందుత్వ వాదులు దీనికి "భూ జిహాద్", "వ్యాపార జిహాద్" లాంటి అనేక కొత్త మాటలు జోడించారు. హిందూ రాష్ట్ర ఏర్పాటు ఉత్తరాఖండ్ నుంచే మొదలవుతుందని కూడా హిందుత్వ వాదులు జంకు గొంకు లేకుండానే ప్రకటిస్తున్నారు. ఈ అంశాన్ని గత పది రోజులుగా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నామమాత్రంగా తప్ప ఇలాంటి హెచ్చరికలు చేసే వారి మీద చర్య తీసుకున్న పాపాన పోలేదు. అదే సమయంలో భీతావహులైన ముస్లింలకు రక్షణ కల్పించే ప్రయత్నమూ చేయలేదు. దీన్నిబట్టి పురోలా నుంచి ముస్లింలను తరిమి వేయడానికి హిందుత్వ వాదులు చేస్తున్న ఆగడాలకు బీజేపీ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ప్రభుత్వం మద్దతు సంపూర్ణంగా ఉందని తేలిపోతోంది. గురువారం హిందుత్వ వాదులు నిర్వహించ దలచుకున్న మహా పంచాయత్‌కు మాత్రం అనుమతి నిరాకరించారు. దీనివల్ల అదనపు సంఘటనలు ఏమీ లేకపోయినా ఉద్రిక్త పరిస్థితి మాత్రం కొనసాగుతూనే ఉంది. తనను తాను "స్వామి"గా ప్రకటించు కున్న దర్శన్ భారతి ముస్లింలను పారదోలే ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. స్థానిక ముస్లింలు హిందువులపై "లవ్ జిహాద్" రుద్దు తున్నారన్న ప్రచారం జోరుగా సాగింది. ముస్లిం యువకులు హిందూ మహిళలను ప్రేమిస్తున్నట్టు నటించి వారిని పెళ్లాడి ఆ తరవాత మతం మార్పిస్తున్నారన్న ఆరోపణను "లవ్ జిహాద్" అంటున్నారు. అయితే జి.కిషన్ రెడ్డి హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు "లవ్ జిహాద్" ఏమీలేదని, ఇలాంటి సంఘటనలు ఎక్కడా నమోదు కాలేదని పార్లమెంటు నిండుసభలో ప్రకటించారు. అయినా హిందుత్వ వాదులు ముస్లింలను బెదరగొట్టడానికి ఈ మాటను నిరంతరం వాడుతూనే ఉన్నారు. ఇలాంటి వాటివల్లే ఉత్తరాఖండ్‌లో ముస్లింల జనాభా పెరిగి పోతోందన్న దుష్ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంలో భాగంగానే హరిద్వార్‌తో మొదలుపెట్టి అనేక చోట్ల ధర్మసన్సద్‌లు (హిందువుల సమ్మేళనాలు) జరిగాయి. ఈ ధర్మ సన్సద్‌లు ఎక్కడ జరిగినా ఆ సమావేశాల్లో ముస్లింలమీద విషం చిమ్మిన ఉదంతాలే కనిపిస్తాయి. ముస్లింల మీద మారణకాండ కొనసాగించాలని పిలుపుకూడా ఇచ్చారు. గత మే 26వ తేదీన ఇద్దరు యువకులు ఈడురాని ఒక హిందూ అమ్మాయిని అపహరించారని, అందులో ఒక యువకుడు ముస్లిం అన్న ప్రచారం నిరాఘాటంగా సాగింది. ఆ పరిసారాల్లో ఉన్న నౌ గావ్, చిన్యాలిసౌర్ లాంటి చోట్ల కూడా ఇలాంటి ఆరోపణలే వినిపించాయి. ఈ వితండ వాదనలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రచారంలో ఉన్నాయి.

ఇంతకీ ఉత్తర కాశీ జిల్లాలోని పురోలాలో ఉన్నది కేవలం గుప్పెడు ముస్లిం కుటుంబాలే. కొందరు ముస్లింలు హిందువుల దగ్గర నుంచి అద్దెకు తీసుకున్న దుకాణాలలో వ్యాపారం చేసుకుంటున్నారు. దీనినే వ్యాపార జిహాద్ అని ప్రచారం చేశారు. హిందుత్వ నాయకుల నుంచి ఒత్తిడి కారణంగా దుకాణాలు అద్దెకు ఇచ్చినవారు ముస్లింలను ఖాళీచేసి వెళ్లిపోవాలని బలవంతపెట్టారు. హిందుత్వ వాదుల ఆగడాలకు సంబంధించి సమాచారం సర్వత్రా అందుబాటులో ఉన్నప్పటికీ పోలీసులు చర్య తీసుకోవడం ఆశ్చర్యంకాక బీజేపీ ప్రభుత్వ అండ దండలతో కొనసాగుతున్న కుట్ర అనుకోవాలి. ముస్లింలు ఖాళీచేసి వెళ్లిపోవాలని పోస్టర్లు అంటించారు. ముస్లింల ఇళ్ల మీద క్రాస్ (x) గుర్తుపెట్టి దాడిచేసే హిందుత్వవాదుల పని సులభం చేశారు. ఈ పనిచేసిన అనామకులమీద కేసు నమోదు చేశారు. అంటే నిందుతుల మీద ఈగవాలనివ్వకూడదన్న పన్నాగం ఉన్నట్టే. సభ్యసమాజం హిందుత్వ వాదుల ఆగడాలను నిరసించింది. 52మంది మాజీ ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, పోలీసు డైరెక్టర్ జనరల్‌కు లేఖరాసి హిందుత్వ వాదుల ఆగడాలు నివారించాలని విన్నవించారు. ఇలాంటి సందర్భాలలో విన్నపాలకు ఏ గతి పడ్తుందో ఈ విన్నపానికి అదే గతి పట్టింది. 15వ తేదీన జరగవలసిన మహా పంచాయత్ అయితే నిలిచి పోయింది. కాని జూన్ 20న తెహ్రీలో ఇలాంటి కార్యక్రమమే తలపెట్టారు. వీటన్నింటి సారం ముస్లింలను వెళ్లగొట్టడమే. విద్వేషాల ప్రసంగాలు చేశారనుకున్నప్పుడు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా తమంత తాము కేసు నమోది చేసి దర్యాప్తు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఉత్తరాఖండ్‌లో బీజేపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలే లేవు. వెళ్లి పోవాలని ముస్లింలను హెచ్చరించామని విశ్వహిందూ పరిషద్ జిల్లా కలెక్టర్‌కు తెలియజేసినా బీజేపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం గుర్తొచ్చినట్టు లేదు. ముఖ్యంగా నైన్ బాగ్, జాఖడ్, నగ్త్రిబ్బ, తట్యూర్, సక్లానా, దంతా, పురోలా, బార్కోట్, ఉత్తరాక్షి లోని ముస్లింలకు ఈ హెచ్చరికలు జారీ చేశాయి. అయినా ముస్లింలు వెళ్లిపోకపోతే వచ్చే 20వ తేదీన రోడ్లను దిగ్బంధించి నిరసన తెలియజేస్తామని కూడా హిందుత్వ వాదులు హెచ్చరించారు.

గత మే 30వ తేదీన ముగ్గురు సుప్రీంకోర్టు న్యాయవాదులు కూడా పురోలాలో జరుగుతున్న దారుణాన్ని నివారించాలని గవర్నర్ కు లేఖ రాశారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. "భూ జిహాద్"ను, "లవ్ జిహాద్" ను సహించబోమని సాక్షాత్తు ముఖ్యమంత్రి ధామీ హుంకరిస్తున్నప్పుడు పోలీసులు నిశ్చేష్టంగా ఉండిపోక ఏం చేయగలరు! గత రెండు నెలల కాలంలో ముస్లింలకు చెందిన అనేక మజార్లను ధ్వంసం చేశారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాసి "ముస్లింలను ఖాళీ" చేయించాలని తుది హెచ్చరిక జారీ చేసినట్టు తెలియజేసింది. ఇలాచేయడం రాష్ట్ర ప్రభుత్వ మద్దతుఉంటే తప్ప సాధ్యం కాదు. ఉత్తరాఖండ్‌ను "జిహాద్"నుంచి విముక్తం చేస్తున్నందుకు ధన్యవాదాలు అని దర్శన్ భారతి అన్నారు. "జిహాదీ" లకు పని ఇవ్వకూడదని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మత వైషమ్యాలను పెంచే వారికి దన్నుగా నిలవాలని ప్రభుత్వమే భావిస్తే మెజారిటీ మతస్థుల మాట నెగ్గడంలో ఆశ్చర్యం ఎందుకు ఉంటుంది.

ఇతడ్ని చదివి జ్వరపడాలి... లేదూ మరణించాలి

మానేపల్లి హృషీకేశవరావు... ప్రభుత్వ జీతం తీసుకున్నారు కదా... ఈ పేరు పే స్లిప్పులో ఉంటుంది. ఎవరి మీదా ఆధార పడే మనిషి కాదు కాబట్టి ఆధార్ కార్డులో కూడా ఉండక పోవచ్చు. నగ్నముని... తెలుగు సాహితీ ప్రపంచంలో ఉన్న వారందరి మనసుల్లోనూ గూడు కట్టుకుని ఉన్నపేరు. ఈ పేరు ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని ఎన్నిసార్లు కుదిపిందో. ఎంతమంది కుర్ర గ్యాంగ్‌ని ప్రజల కోసం ఆలోచించేలా చేసిందో.



"తల్లి వంటింటి అలుగుడ్డ. ఎడ తెరిపిలేని దగ్గుగా మారి చింకి చాప మీద ముణగదీసుకునేది. అర్ధరాత్రి మసిబారిన లాంతరు కళ్లు, సగం, సగం అవయవాలతో ఇంటి కొచ్చే కట్టెతో కాపురం చేసేది" ఇది నగ్నముని రాసిన సిమెంట్ సంతతి కథలో హీరోయిన్ తల్లి గురించి వర్ణన.

"విశ్వశ్రేయం కావ్యం అని అరుస్తూ... ప్రబంధ నాయికి తొడల బంధనాల్లో పాదాలకు పూసుకుని ఎగిరే లేపనాల్లో అంటుకున్న కవిత్వం అబద్ధం తపస్సు చేయడానికి వెళ్లవలసింది హిమాలయాల్లోకి కాదు జనంలోకి..." ఇదీ నగ్నముని చెప్పిందే. కొయ్యగుర్రం కావ్యంలో. నా మటుకు నాకు శ్రీశ్రీ వారసుడు నగ్నమునే. శ్రీశ్రీ ముందు శూన్యం గురించి

చక్రవాకం

\- ముక్కాముల చక్రధర్

నాకు తెలీదు కాని... శ్రీశ్రీ ఉన్నప్పుడు కూడా తెలుగు కవిత్వంలో ఎలాంటి శూన్యం కనిపించకుండా ప్రజా కవిత్వాన్ని రాసిన ఏకైక కవి నగ్నమునే. మా ఇద్దరివీ ఇంచుమించు ఒకే జీవికలు. కాకపోతే నగ్నముని ప్రభుత్వ జీతం తీసుకునే వారు...నేను ప్రైవేటు జీతం తీసుకునే వాణ్ని. అయితే, ఏదిపడితే అది రాయడానికి నాకున్న వెసులుబాటు నగ్నమునికి లేదు. శాసనసభలో రిపోర్టర్ ఉద్యోగం కదా....అక్కడ ఏం జరిగినా ప్రభుత్వానికి అనుకూలంగానే రిపోర్ట్ చేయాలి. నాకు ఆ నిబంధనలేదు. అసెంబ్లీ లోపల ఉన్న హృషీకేశవరావు ఆ గేటు దాటాకా నగ్నమునిగా మారడం వెనుక పడిన పురిటి నొప్పులు...బహుశా ఏ తల్లీ పడిన నొప్పులకు అతీతం కాదు. తన ఇష్ట రచయిత చలం అన్నట్లు ప్రతి నెలా జీతం, బ్యాంకు బ్యాలెన్స్.... మలక్‌పేట ప్రభుత్వ క్వార్టర్స్ వారు అనుమతిస్తే ఓ వొట్టిపోని ఆవు పెట్టుకునేంత సకల సౌకర్యాల హృషీకేశవరావు...నగ్నమునిగా రాత్రిళ్లు కొయ్యగుర్రంపై స్వారీ చేయడం వెనుక అచ్చంగా ప్రజలే ఉన్నారు. అదీ అణగారిన, అడుగంటిపోయిన వారి జీవితాలే ఉన్నాయి.

విలోమ కథలు....దేశం చీకటి రోజుల్లో మగ్గిన కాలంలో రాసిన కథలు. చీకటిరోజుల్లో...ఆ చీకటి రోజుల గురించి నగ్నముని గానం చేసిన కథలు. ఈ కథలు చదివిన తర్వాత జర్వ పడాలి. అలా పడకపోతే.... నువ్వు ఏలికలతో మమైకమేపోయినట్లే. లేదూ నువ్వే ఏలికగా మారినట్లే. తుపాసుకేముంది.... దానికి ఇష్టం వచ్చినప్పుడో.... ఆకలి వేసినప్పుడో.... హఠాత్తుగా మీద పడే పులిలాంటిది. ఆ పులికి ఆహారం అయ్యేది మాన్యులు కాదు. సామాన్యులే. పులికి బలైన వారి లెక్కలు తీయడమే కొయ్యగుర్రం పని. జనాభా లెక్కల్లో ఎంత తగ్గిందో విపులంగా చెప్తారు. వివరిస్తారు... నెపాన్ని కాసేపు సముద్రం మీదకి నెట్టేస్తారు. కొయ్యగుర్రం కదలదు. కదలనివ్వదు. వేట దృశ్యాన్ని చూస్తూ ఓ రాజకీయపు నవ్వు నవ్వుతుంది. లోలోపల వికటాట్టహాసం చేస్తుంది. ఆ నవ్వుల పరదాలు విప్పేవాడు, ఆ వికటాట్టహాసం బట్టలూడదీసి "బాబోరే....ఇది కొయ్యగుర్రంరా....దీన్నుంచి కాపాడుకోవాలంటే నీకు ఎర్రదీపాలే జీవన సామాగ్రిరా" అని చెప్పగలిగిన వాడే నిజమైన ప్రజా కళాకారుడు. ఆ పని హోచిమిన్ చేసాడు...గోర్కీ చేశాడు. అర్ధాయుష్షే అయినా ఆ మూడు దశాబ్దాల జీవితంలో చెగువేరా చూపించాడు. కవిగారి కుమారుడు మానేపల్లి వారబ్బాయి హృషికేశవరావు కాదు... నగ్నముని చేశాడు.

ఈ నగ్నమునిని ఎవరెవరితోనో పోలుస్తారు. కాఫ్కా అంటారు. అల్బర్ట్ కామూ అంటారు. మరొకటంటారు. ఇంకొకటంటారు. వాళ్లంతా చదివేసు కుని ఈ పేర్లన్నీ ఈ ఎనిమిది పదుల యువకుడికి అతడి నలభయ్యో ఏటే పెట్టేశారు. ఈ నగ్నముని కొయ్యగుర్రం చాలాభాషల్లోకి వెళ్లిందికదా.... ఆయా భాషల వాళ్లు అక్కడి కొత్తకవులు,రచయితలని వాళ్ల భాషల్లో "వీడు తెలుగు కవి నగ్నమునివంటి వాడర్రా" అంటున్నారని నాకెందుకో అనిపిస్తుంది. వాళ్ల భాషల్లో చెప్పలేను కాని.....అనుకుంటూనే ఉంటారనికూడా నాకో నమ్మకం. నగ్నముని కాఫ్కా కాదు...కామూకూడా కాదు...వాళ్లిద్దరికే కాదు....సమస్త సాహిత్య ప్రపంచానికి నగ్నముని నగ్నమునే. ఈ విలోమ కథకుడే... ఈ కొయ్యగుర్రం కవే వాళ్లకి పోలిక. నా వరకూ నగ్నముని తెలుగు సాహిత్యం ఎప్పుడో చేసుకున్న పుణ్యఫలం. కొండకచో... పాపఫలం కూడా...

(నేడు తెనాలిలో నగ్నముని విలోమ కథలు ఆవిష్కరణ)

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

మోదీ పాలనలో రెట్టింపైన బ్యాంకు మోసాలు

డాక్టర్ జ్ఞాన్‌పాఠక్

బీజేపీ నాయకత్వంలో నరేంద్రమోదీ ప్రభుత్వం మొదటి ఎనిమిదేళ్ల కాలంలో అనేక బ్యాంకుల్లో మోసాలు రెట్టింపయ్యాయి. ఇక తొమ్మిదవ సంవత్సరం మొదటి ఆరు నెలల్లో అంతక్రితం కంటే వేగంగా మరిన్ని మోసాలు వెలుగుచూశాయి. మోదీ పాలన పదవ సంవత్సరంలోకి ప్రవేశించింది. మరో పదినెలల్లో లోకసభఎన్నికలు జరుగుతాయి. బ్యాంకులను మోసగించిన వారితో రాజీ పరిష్కారానికి ప్రభుత్వం అనుమతించింది. ఇది సామాన్యులకు వర్తించదు. బ్యాంకులను, ఇతర ఆర్థిక సంస్థల్లో మోసాలుచేసిన వారికి మాత్రమే వర్తిస్తుంది. వీళ్లకే మళ్లీ కొత్తగా బ్యాంకులు రుణాలిస్తాయి. ఇలాంటి మోసకారులు, బ్యాంకుల్లో పనిచేస్తూ అక్రమంగా డబ్బు కావాలనుకునే అధికారులు కలిసి బ్యాంకులను దివాలా తీయిస్తున్నారు. పాలకులకు వీరు రహస్య ముడుపులు చెల్లించుకుంటారు. ఎన్ని లక్షల కోట్లు దోచుకున్నా ఈ ప్రభుత్వం మౌనంగానే ఉంటుందని మోసకారులకు బాగాతెలుసు. అధికారంలోకి వచ్చే ముందు మోదీ తన ప్రచారంలో బ్యాంకుల్లో మోసాలను పూర్తిగా అరికడతామని వాగ్దానం చేశారు. ఆచరణలో మాత్రం అంతక్రితం ప్రభుత్వాల హయాంలో కంటే ఎక్కువ మోసాలు జరిగాయి. 2013-14 నుంచి బ్యాంకులను మోసగించినవారి సంఖ్యను పరిశీలిద్దాం. ఈ సంవత్సరం 4306 మంది ఎగవేతదారులు నమోదయ్యారు. అంతక్రితం ఉన్నది వారు గాకుండా కొత్తగా ఎగవేతదారుల జాబితాలో చేరినవారు వీరు. వీరి సంఖ్య 2021-22వ ఆర్థికసంవత్సరంలో 9,103మంది మోసకారులు నమోదయ్యారు. ఈ గణాంకాలను రిజర్వు బ్యాంకు ఆరునెలల క్రితం విడుదల చేసింది. 2022 తర్వాత మోసాల సంఖ్య మరింతగా పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరునెలల కాలంలో ఎగవేత దారుల సంఖ్య 5,406గా నమోదైంది. ఈ ఎగవేతలన్నీ బ్యాంకుల్లో మోసాలను అరికడతానని దేశ ప్రజలందరికీ వాగ్దానం చేసిన మోదీ పాలనలో జరిగినవే. ఇలాంటి వాగ్దానాలను మరిచి మోదీ ప్రభుత్వం దేశంలో కల్లోల, అసహన, మత విద్వేష ఘర్షణ వాతా

వరణాన్ని సృష్టించింది. ఈ ధనమంతా ప్రజలు కష్టపడి బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో దాచుకున్నారు. బహుశా పాలకుల ఆశ్రితపక్షపాతంవల్లే దోచు కున్నవని భావించాలి. ఇలాంటి ఎగవేతదారులే దేశ అభివృద్ధికి కారకులని మోదీ ప్రచారం చేస్తూ మనల్ని కూడా నమ్మమంటారు. ఈ విషయాన్ని సామాన్య జనం గ్రహిస్తే ఈ 'గొప్ప పాలకులను' సహించడం సాధ్యంకాదు. అయినప్పటికీ మోసకారులు 'రాజీ పరిష్కారం' చేసుకోవడానికి ఆర్‌బీఐ 2023, జూన్ 8న విడుదల చేసిన సర్క్యులర్‌లో అనుమతించింది. అంతేకాదు ఎగవేత దారులు (మోసకారులు) మళ్లీ రుణాలు తీసుకోవడానికి కూడా అను మతించింది. తాను చేసే పనులన్నీ ప్రజాప్రయోజనాల కోసమని మోదీ ప్రచారం చేసుకుంటున్నారు. అప్పులు తీసుకున్న మోసకారులు కావాలని తాము తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించనివారే. ఏలినవారికి వీరంతా బాగాకావలసిన వారేనని అనడంలో ఏమీ అనౌచిత్యం లేదు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కావాలని రుణాలు ఎగ్గొట్టిన వారు కాగా, మోసాలకు పాల్పడిన బడా చోర్లు పన్నులు కూడా సరిగా కట్టరు. చివరకి కరెంటు బిల్లులు కట్టనివారిని సైతం ప్రభుత్వం ఏమీ పట్టించుకోదు. రాజీ పరిష్కారం చేసుకునే మోసకారులు, కంపెనీల రుణమొత్తాలను రద్దుచేసినట్టు కూడా ప్రకటిస్తారు. బ్యాంకులకు అవసరమైన ధనాన్ని ప్రభుత్వం కొత్తగా నోట్లు ముద్రించి బ్యాంకులకు ఇస్తుంది.

2022 డిసెంబరులో పార్లమెంటులో ఆర్థికమంత్రిత్వశాఖ మోసకారులు ఎగవేసిన 11.7 లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసినట్లు తెలియజేసింది. బ్యాంకులు తమ పుస్తకాల నుంచి ఇలాంటి మోసాకారుల అప్పుల జాబితాను తొలగించి మళ్లీ రుణాలుఇవ్వడం మామూలే. ఇలాంటిదొంగలకు బహుమతిగా అప్పులు రద్దుచేసి సామాన్యుల జీవితాలను అధోగతిపాలు చేస్తున్నారు. మరో వైపు పేదరికాన్ని, నిరుద్యోగాన్ని పెంచుతూ 'అభివృద్ధి' డప్పు మోగిస్తున్నారు. ఒక పద్ధతి ప్రకారం బ్యాంకులను లూటీచేస్తూ ప్రభుత్వం మోసకారులకు మోదీ అండగా ఉండటం ఘోరమైన నేరంగా పరిగణించాలి. అప్పులు వసూలు చేయకపోగా కావాలని అప్పులు ఎగ్గొడుతున్న వారిపై నేర పూరితమైన కేసులు ఎందుకు నమోదు చేయడం లేదు? ఈ దేశప్రజాధనాన్ని దొంగలకు సహ కరిస్తున్న బ్యాంకుల్లో అధికారులను గుర్తించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? రాజీ పరిష్కారాలద్వారా రద్దుచేసిన ధనం లక్షకోట్లరూపాయలే ఉండ వచ్చు. ప్రతిఏటా మోసకారులు విదేశాల్లో స్థిరపడుతున్నవారు వేల సంఖ్యంలో ఉన్నారు. ఈ సంవత్సరం బ్యాంకులను, ప్రజలను మోసగించి విదేశాలకు తరలివెళుతున్న నల్ల కుబేరులు 5,600 మంది ఉండవచ్చునని ఒక సర్వే తెలియజేసింది. నిత్యం వెలిగిపోతున్న మోసకారులుపై అప్రమత్తంగా ఉండాలని పరోక్షంగా పాలకును ఆర్‌బీఐ హెచ్చరిస్తున్నది. ఇది తిరోగమన చర్య అని, మోసకారులతో రాజీ ఏమిటని ఆర్థిక నిపుణులే కాదు, పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం, ఆర్‌బీఐ మోసకారులు అప్పులకోసం రాజీ పరష్కారానికి పూనుకోవడం న్యాయసూత్రాలను, జవాబుదారీని కాలదన్నడమేనని అఖిల భారత బ్యాంకు అధికారుల అసోసియేషన్ (ఏఐబీఓసి) అఖిల భారత బ్యాంకు ఉద్యోగులు అసోసియేషన్ (ఏఐబీఈఏ) తీవ్రంగా విమర్శించాయి. చిత్తశుద్ధి, నిజాయితీలేని మోసకారులకు ఇది బహుమతి అని పేర్కొన్నాయి. ఆర్థికరంగ పార్లమెంటుస్థాయి సంఘానికి సంబంధించిన విభాగం బ్యాంకుల బోర్డులలో నామినేట్‌చేసే డైరెక్టర్లు జవాబుదారీగా ఉండే వారిని నియమించాలని సిఫారసు చేసింది. అయినప్పటికీ ఇబ్బడి ముబ్బడిగా జరిగిపోతున్నా పట్టించుకున్నవారు కరువయ్యారు. కోటి రూపాయలు అప్పుచేసి ఎగవేస్తున్నప్పటికీ రుణాలు తీసుకున్నవారి పేర్లు సైతం ప్రభుత్వం చెప్పడంలేదు. ఎందుకని?

నిర్లక్ష్యంతో తరచు రైలు ప్రమాదాలు

రైలు భద్రతపై ప్రభుత్వం తగిన శ్రద్ధ చూపడం లేదని రైల్వే ఉద్యోగుల సంఘాలతో పాటు అధికారులు పలుమార్లు ఎత్తిచూపారు. రైల్వే భద్రతను మెరుగుపరచడానికి రానున్న కొన్నేళ్లలో 1 లక్ష కోట్లు ఖర్చు చేయాలి. రెండు రైళ్ల మధ్య ఢీ కొనడాన్ని నివారించడానికి, రైళ్లలో "కవాచ్" అనే యాంటీ-కొలిషన్ పద్ధతిని ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రచారం చేస్తోంది. అయితే, దేశంలోని 97శాతం రైళ్లలో ఇది ఇంకా అమలు చేయలేదు. ప్రమాదానికి గురైన సూపర్ ఫాస్ట్ రైళ్లలో ఈ వ్యవస్థ లేదు. సిగ్నలింగ్ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం చాలా సంవత్సరాల నుండి రైల్వేలకు ఒక క్లిష్టమైన సమస్య. లోకో పైలట్ల యూనియన్లు సిగ్నల్స్ లోపభూయిష్ట సమస్యపై అధికారుల దృష్టికి తీసుకొనివచ్చారు. ఒక్క ఏడాదిలోనే 51,238 సార్లు సిగ్నల్ ఫెయిల్యూర్ నమోదైందంటే సమస్య తీవ్రత స్పష్టంగా కనిపిస్తోంది. భారతీయ రైల్వేలో బ్లాక్ ప్రూవింగ్ యాక్సిల్ కౌంటర్లు వ్యవస్థ ఉంది. ఆ సెక్షన్‌లో మరో రైలును అనుమతించే ముందు ట్రాక్ సెక్షన్ ఖాళీగా ఉందని నిర్ధారించుకోవడం కోసం ఈ వ్యవస్థ ఉంది. ఇది మానవ తప్పిదాలను తొలగించడం, స్టేషన్ల మధ్య రైళ్ల సురక్షిత కదలికను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ ప్రైవేట్ సంస్థలు భారతీయ రైల్వేలకు నాణ్యత లేని రక్షణ పరికరాలు సరఫరా చేస్తున్నాయి.15,000 కి.మీ రైల్వే ట్రాక్‌లు లోపభూయిష్టంగా ఉన్నాయి. వీటికి తక్షణమే మరమ్మతులు అవసరం. ప్రతి సంవత్సరం, అదనంగా 4,500 కి.మీ రైల్వే ట్రాక్ పునరుద్ధరణకు కారణం అవుతుంది. కేవలం 2,000 కి.మీ మాత్రమే పునరుద్ధరణ జరుగుతుంది. ఈ విధంగా, లోపభూయిష్ట ట్రాక్‌ల మొత్తం పొడవు ప్రతిఏటా పెరుగుతోంది.

కార్మికుల కొరత కారణంగా, ట్రాక్ తనిఖీలో 30శాతం నుండి 100శాతం లోటు ఉంది. ఇటువంటి లోపభూయిష్టమైన, ప్రమాదకరమైన ట్రాక్‌లపై రైళ్లు ప్రతిరోజూ, ప్రతి గంటకు అధిక వేగంతో నడవడంతో వేలాది మంది ప్రయాణికులు, రైల్వే కార్మికుల ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. గూడ్స్ రైళ్ల ట్రాక్‌ల కోసం సిఫార్సు చేసిన లోడ్‌లకు మించి ఓవర్‌లోడ్‌లో పయనిస్తున్నాయి. సూపర్‌ఫాస్ట్ రైళ్లు నడిచే ఇతర దేశాల్లో వాటి కోసం ప్రత్యేక కొత్త ట్రాక్‌లను ఏర్పాటు చేస్తారు. మన దేశంలో లోకో పైలట్ యూనియన్‌లు సిఫార్సు చేసిన వాటి కంటే ఎక్కువ వేగంతో పాత ట్రాక్‌లపైనే సూపర్‌ఫాస్ట్ రైళ్లను నడపాల్సి వస్తోందని ఫిర్యాదు చేస్తున్నారు. ఇది ప్రాణాలకు మరింత ముప్పు కలిగిస్తుంది. డిసెంబర్ 2022లో పార్లమెంటులో సమర్పించిన నివేదిక ప్రకారం, భారతీయ రైల్వేలో 4 సంవత్సరాలలో 1129 పట్టాలు తప్పిన కేసులు! ఈ పట్టాలు తప్పిన వాటిలో ఎక్కువ భాగం గూడ్స్ రైళు న్నాయి. రైలు వంతెనల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2019-2020 కాగ్ నివేదిక ప్రకారం ప్రభుత్వం భద్రతా చర్యల కోసం 1,14,000 కోట్లు అవసరం. అయితే ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. చాలా వరకు ప్యాసింజర్ రైళ్లు చాలా అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. రోజుకు దాదాపు 2 కోట్ల మంది రైళ్లలో ప్రయాణిస్తున్నారు. వారిలో చాలా మంది రోజువారీ ప్రయాణికులు. రోజురోజుకూ రైల్వేల పరిస్థితులు దిగజారుతున్నాయి. కోవిడ్ తర్వాత, చాలా రైళ్లు తగ్గించారు. సాధారణ నాన్-ఎసి, నాన్-రిజర్వ్ బోగీలు బాగా తగ్గించారు. ఈ కారణంగా రద్దీ ఎక్కువ కావడంతో తలుపుల వెలుపల, రెండు బోగీల మధ్య వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఇటీవల ఒడిశా ప్రమాదంలో రిజర్వ్ చేయని కోచ్‌లు వాటి సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులతో పయనించాయి. పెద్ద సంఖ్యలో మరణాలు, గాయాలు నమోదవడానికి ఇదే ప్రధాన కారణం. రైలు ప్రమాదాలకు రైలు కార్మికులను నిందించడం అన్ని ప్రభుత్వాల ఆచారం. బాలాసోర్ ఘోర ప్రమాదం వెనుక కుట్ర ఉందనే దర్యాప్తు గురించి మాట్లాడటం ద్వారా, సమస్య మూలకారణం నుండి ప్రజల దృష్టిని మరల్చాలని ప్రభుత్వం భావిస్తోంది. భారతీయ రైల్వేల ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, లాభాల వైపు దృష్టి కేంద్రీకరించడం , భద్రత వైఫల్యాల వలన తరచు ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నవి.

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752

నేతన్నల ఉద్యమ బాట

మన దేశంలో వ్యవసాయం తర్వాత రెండో అతిపెద్ద ఉపాధి కల్పనదారుగా ఉన్న చేనేత పరిశ్రమపై పాలకుల చిన్నచూపు కారణంగా ఈ రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవన ప్రమాణాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికీ 2 లక్షల మేర మగ్గాలు వుండగా, ఉపవృత్తుల్లో మరో లక్షమంది సహా సుమారు 5 లక్షల మందికి చేనేతే జీవనాధారం. స్వయం ఉపాధి రంగంలో అత్యధికంగా చేనేతలు ఉన్నా పాలకుల నిర్లక్ష్యం, నిరాదరణ వల్ల వారి జీవన ప్రమాణాలు అట్టడుగు స్థాయికి దిగజారిపోతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రెండు లక్షల కోట్ల పైచిలుకు చేరినా.. అందులో చేనేతలకు నామమాత్రంగా 200 కోట్లు మాత్రమే కేటాయించారంటే ఇంతకన్నా దారుణం ఏముంటుంది? కేంద్ర ప్రభుత్వం కూడా బడ్జెట్లో 45 లక్షల కోట్లు కేటాయింపులు చేస్తే... చేనేతకు 200 కోట్లు మాత్రమే కేటాయించడం మరీ దారుణం. ఈ కేటాయింపుల ద్వారా చేనేత రంగంపై పాలకులకు ఏపాటి శ్రద్ధవుందో చెప్పకనే చెబుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం నూలుధరపై సబ్సిడీ, రిబేట్, త్రిఫ్ట్ ఫండ్, పావలా వడ్డీ వంటి పాత పథకాలను పూర్తిగా ఎత్తివేసింది. ఇదిలావుంటే, చేనేతలకు నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి 24 వేల రూపాయల నగదు నేరుగా అందజేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటోంది. రాష్ట్రంలో మూడు లక్షల మంది నేతన్నలు ఉంటే కేవలం 80 వేల పైచిలుకు చేనేత కార్మికులకు మాత్రమే నేతన్న నేస్తం పథకాన్ని వర్తింపజేస్తోంది. నేతన్న నేస్తం పథకం కేవలం సొంత మగ్గం ఉన్న కార్మికులకే వర్తింపజేయడం మరీ విడ్డూరం. షెడ్డు మగ్గాలు నేసే కార్మికులకు, చేనేత ఉపవృత్తుల పనివార్లకు ఈ పథకం వర్తింపచేయకుండా వివక్ష కనబరుస్తోంది. అసలే చేనేత వృత్తి సంక్షోభంలోకి కూరుకుపోతోంది. వస్త్ర నిల్వలు పేరుకుపోయి నేత కార్మికులకు పని దొరకక దుర్భర జీవితం గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో పనిచేస్తున్న చేనేత కార్మిక సంఘాలు ఉద్యమబాట పట్టాల్సిన అవసరాన్ని గుర్తించి, సమిష్టిగా నడుం బిగించాయి.

ప్రధానంగా చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్లు...నిల్వవున్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని (1985) పకడ్బందీగా అమలు చేయాలి. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికుడికి (షెడ్డు చేనేత కార్మికులకి, ఉపవృత్తుల కార్మికులకి) వర్తింప చెయ్యాలి. చేనేతపైన జీఎస్‌టిని పూర్తిగా రద్దు చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్ 2,60,868 కోట్లలో చేనేతకు 200 కోట్లు మాత్రమే కేటాయించారు. అయితే రూ. 5 వేల కోట్లు కేటాయించాలి. కేంద్ర ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్ రు.45,03,097 కోట్ల బడ్జెట్‌లో చేనేతకు రు.200 కోట్లు మాత్రమే కేటాయించారు. అలాకాకుండా రూ.25 వేల కోట్లు కేటాయించాలి. విద్యా సంస్థలు సహా, అన్ని ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాలనే వినియోగించాలి. నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాల ధరలు 2021 నాటి ధరల స్థాయికి తగ్గించాలి. చేనేత సహకార సంఘాల బకాయిలను ప్రభుత్వం వెంటనే

చెల్లించాలి. ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 3 సెంట్ల స్థలం మంజూరుచేసి హౌస్ కమ్ వర్క్ షెడ్ నిర్మించాలి. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో పనిచేస్తున్న చేనేత కార్మిక సంఘాలు చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ పేరిట ఈ నెల 19న రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించి తమ సత్తాచాటే దిశగా పయనిస్తున్నాయి. చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సంఘాలను భాగస్వాములుగా చేసి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం, జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం), రాష్ట్ర చేనేత జన సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కాంగ్రెస్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ (న్యూ)) అన్ని సంఘాలు కలిసి చేనేత డిమాండ్లను సాధించుకోవాలనే పట్టుదలతో ఉద్యమ కార్యాచరణను చేపట్టాయి.

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం సాగుచట్టాలను తీసుకువస్తే... రైతాంగం ఉవ్వెత్తున ఎగిసిపడి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఉద్యమిస్తేనే తమ డిమాండ్లను సాధించుకోగలమనడానికి దేశవ్యాప్త రైతు ఉద్యమమే నిదర్శనం. అదేకోవలో నేడు చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ కూడా కలెక్టరేట్ల వద్ద ధర్నాలతో సరిపెట్టకుండా.. చేనేతల అభ్యున్నతికి ఉద్యమబాట కొనసాగించాల్సిన అవసరం లేకపోలేదు.

(చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 19, 2023న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు సందర్భంగా)

అవ్వారు శ్రీనివాసరావు, సెల్: 9492080519

బిపోర్జాయ్ బీభత్సం

- వెయ్యి గ్రామాలకు విద్యుత్ కట్
- నేల కూలిన వృక్షాలు... ధ్వంసమైన ఇళ్లు
- ప్రాణ నష్టం లేదు... 23 మందికి గాయాలు

అహ్మదాబాద్/న్యూఢిల్లీ : బిపోర్జాయ్ తుపాను గుజరాత్‌లో బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలుల వల్ల భారీ సంఖ్యలో చెట్లు నేలకూలాయి. అలాగే వందల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సుమారు వెయ్యి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుపాను తీరం దాటడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, అయితే 23 మంది గాయపడ్డారని ఎన్‌డీఆర్ఎఫ్ తెలిపింది. విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు పీజీవీసీఎల్ ప్రయత్నిస్తోంది. కచ్-సౌరాష్ట్ర ప్రాంతాన్ని అతలాకుతలం చేసిన బిపోర్జాయ్ తుపాను వల్ల 5,120 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 4,600 గ్రామాలకు విద్యుత్‌ను నిలిపివేసినందున, ఎటువంటి మానవ ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు చెబుతున్నప్పటికీ, విధ్వంసానికి సృష్టించింది. 3,580 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, 1,000 పైగా గ్రామాల్లో ఇప్పటికీ విద్యుత్ సరఫరా లేదని అధికారులు తెలిపారు. దాదాపు 600 చెట్లు నేలకూలాయని, మూడు రాష్ట్ర రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయని, చెట్లు కూలడం, తుపాను కారణంగా చాలా ఇళ్లు దెబ్బతిన్నాయని వారు తెలిపారు. బిపోర్జాయ్ (బెంగాలీలో విపత్తు అని అర్థం) 140 కి.మీ వరకు విధ్వంసక గాలి వేగం, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిశాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అయితే సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాలలో ఉన్న గ్రామాలలోకి ప్రవేశించిందని అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రం 6.30 గంటల నుంచి జఖౌ ఓడరేవు సమీపంలో తుపాను తీరాన్ని తాకడం ప్రారంభించినప్పటి నుంచి కచ్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయని, ఈ ప్రక్రియ తెల్లవారుజామున 2.30 గంటల వరకు కొనసాగిందని వారు తెలిపారు. 'బిపోర్జాయ్ తుఫాను కారణంగా ఇప్పటివరకు ఎటువంటి మానవ మరణం నివేదించబడలేదు. ఇది మా సమష్టి కృషి వల్లే సాధ్యమైంది' అని రాష్ట్ర రిలీఫ్ కమిషనర్ అలోక్ కుమార్ పాండే గాంధీనగర్‌లో విలేకరులకు చెప్పారు. తుపాను తీరం దాటకముందే లక్ష మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఆయన తెలిపారు. భావ్‌నగర్ జిల్లాలో వరదలు ఉన్న లోయలో చిక్కుకున్న తమ మేకలను రక్షించే ప్రయత్నంలో గురువారం పశువుల పెంపకందారులయిన తండ్రీకొడుకులు చనిపోవడం గురించి అడిగిన ప్రశ్నకు పాండే, జిల్లాలో తుపాను ప్రభావం లేనందున, తుపాను సంబంధితంగా లెక్కించబడదని చెప్పారు. 'తుపాను కారణంగా రాష్ట్ర విద్యుత్ సంస్థ పశ్చిమ్ గుజరాత్ విజ్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన 5,120 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. వాటిని పునరుద్ధరిస్తున్నారు. దాదాపు 4,600 గ్రామాలకు విద్యుత్ సరఫరా లేదు. అయితే 3,580 గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాము' అని ఆయన వివరించారు. మిగిలిన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయని, అయితే ప్రతికూల వాతావరణం వల్ల పనులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని పాండే చెప్పారు. 'మూడు రాష్ట్ర రహదారులు దెబ్బతిన్నాయి. నివేదికల ప్రకారం మొత్తం 581 చెట్లు నేలకూలాయి. తొమ్మిది పక్కా, 20 కచ్చా ఇళ్లు నేలమట్టం అయ్యాయి. రెండు పక్కా, 474 కుచ్చా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి' అని అన్నారు. 65 గడ్డి ఇళ్లు ధ్వంసమయ్యాయని, తుపాను కారణంగా నష్టపోయిన వారికి తక్షణ పరిహారం కోసం ప్రభుత్వం ఆర్డర్‌ను సిద్ధం చేస్తోందని అధికారి తెలిపారు. మీడియా, సామాజిక సేవా సంస్థలు, ప్రభావిత ఎనిమిది జిల్లాల పరిపాలన, వివిధ జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లుగా ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు వారి వారి జిల్లాల్లో సహాయ చర్యలు మెరుగైన సమన్వయంతో జరిగేలా చూస్తున్నారని అన్నారు. ఈ సమష్టి కృషి వల్ల అరేబియా సముద్రానికి దగ్గరగా ఉన్న గ్రామాల నుంచి అత్యధికంగా లక్ష మందికి పైగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించామని, పరిస్థితి మెరుగుపడటంతో స్థానిక జిల్లా యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించిన వారిని తిరిగి తరలించడం ప్రారంభిస్తుందని ఆయన చెప్పారు. తుపాను బలమైన గాలి, భారీ వర్షపాతం కొనసాగుతున్నందున కచ్ నుంచి సమాచారం రావడానికి సమయం పడుతుందని పాండే చెప్పారు. తుపాను తీవ్రత తీరం దాటిన గంటల తర్వాత 'చాలా తీవ్రమైన' నుంచి 'తీవ్రమైన' కేటగిరీకి తగ్గింది. తుపాను ఈశాన్య దిశగా పయనించి తుపానుగా బలహీనపడి, సాయంత్రానికి దక్షిణ రాజస్థాన్‌లో అల్పపీడనంగా మారుతుందని అధికారులు తెలిపారు. కాగా, శుక్రవారం సాయంత్రానికి ఇది సౌరాష్ట్ర, కచ్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనంగా మారుతుందని, గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని ఐఎండీ డీజీ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. రాజస్థాన్‌లోని బార్మర్, జలోర్, జైసల్మేర్, సిరోహి, జోధ్పూర్, పాలి పరిసర ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జోధ్‌పూర్ డివిజన్‌లోని అన్ని కళాశాలల్లో శుక్ర, శనివారాల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను జోధ్‌పూర్ విశ్వవిద్యాలయం వాయిదా వేసింది. గుజరాత్ తీరంలో బిపోర్జాయ్ తుపాను బీభత్సం సృష్టించిన నేపథ్యంలో ద్వారకా జిల్లాలోని రూపెన్ బందర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ఇద్దరిని ఎన్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది. తుపాను గుజరాత్ తీరాన్ని తాకిన తర్వాత భుజ్ లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్ క్లియరెన్స్ ఆపరేషన్ చేపట్టారు. గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ గాంధీనగర్‌లోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌లో తుపాను ప్రభావాన్ని అంచనా వేశారు.

ప్రాణ నష్టం లేదు : ఎన్‌డీఆర్ఎఫ్

రాష్ట్రంలోని సుమారు 1,000 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఎన్‌డీఆర్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అతుల్ కర్వాల్ శుక్రవారం తెలిపారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుపాను ధాటికి రెండు ప్రాణాలు పోగొట్టుకోగా, గుజరాత్ తీరం దాటిన తర్వాత ఒక్క మనిషి కూడా ప్రాణాలు కోల్పోలేదని అన్నారు. గుజరాత్ పరిపాలన యంత్రాంగం, ఇతర సంస్థలు చేపట్టిన సమన్వయ ప్రయత్నాల వల్ల ప్రాణనష్టం, ఆస్తి నష్టం తక్కువగా ఉండేలా చూడటం దీనికి కారణం అని ఆయన అన్నారు. తుపాను ప్రభావంతో కనీసం 23 మంది గాయపడ్డారని జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ప్రధానాధికారి తెలిపారు. కాగా, విద్యుత్ కోతలను ఎదుర్కొంటున్న ఈ గ్రామాల్లో దాదాపు 40 శాతం తుపాను తీవ్రతను భరించిన కచ్ జిల్లాలోనే ఉన్నాయని ఆయన చెప్పారు. అలాగే, రాష్ట్రంలో రహదారి వ్యవస్థ చాలా సవ్యంగా ఉందని, సెల్‌ఫోన్ నెట్‌వర్క్ 'ప్పటికీ చెక్కుచెదరకుండా' ఉందని వివరించారు. భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు చిక్కుకుపోయే పరిస్థితికి దారితీసే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాత గురువారం సాయంత్రం జలోర్ (రాజస్థాన్)లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని ఉంచినట్లు డీజీ చెప్పారు. తుపాను తర్వాత ఏర్పడే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు మహారాష్ట్ర (ముంబై)లో ఐదు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, నాలుగు బృందాలను కర్నాటకలో మోహరించినట్లు కర్వాల్ వివరించారు.

'మహా కూటమి' పక్షాలపై
మాంఝీ 'గూఢచర్యం'
నితీశ్ కుమార్ ఆరోపణ



పాట్నా : హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీ వ్యవస్థాపకుడు జితన్ రామ్ మాంఝీ బీజేపీ ప్రయోజనాల కోసం 'మహా కూటమి మిత్రపక్షాలపై గూఢచర్యం' చేస్తున్నాడని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ శుక్రవారం ఆరోపించారు. ఆయన నిష్క్రమణ మంచి వివాదాస్పదమని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి మాంఝీ జూన్ 23న జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశంలో పాల్గొనాలని కోరుకున్నారని నితీశ్ స్వయంగా అంగీకరించారు. అయితే తరువాతి వారు బీజేపీ సమ్మేళన వివరాలను లీక్ చేస్తారనే భయంతో ఉన్నారని అన్నారు. 'అతను బీజేపీ నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాడు. ఇటీవల అనేక మంది నాయకులను కలిశాడు. అతను జూన్ 23 విపక్ష నేతల సమావేశంలో భాగం కావాలనుకున్నాడు. కానీ అతను సమస్యలను, విషయాలను లీక్ చేస్తారనే భయాలు నాకు ఉన్నాయి. జూన్ 23న చర్చించనున్నాం' అని తెలిపారు. 'అందుకే హెచ్ఏఎం(ఎస్) ని జేడీయూలో విలీనం చేయమని అడిగాను. అలా కుదరదని, దీనిపై మహాకూటమి నుంచి వైదొలగాలని కోరానని.. ఆయన తప్పుకోవడం విశేషం' అని రాష్ట్ర మంత్రివర్గంలో సోన్‌బర్సా అసెంబ్లీ స్థానం నుంచి జేడీ(యూ) ఎమ్మెల్యే రత్నేష్ సదా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం కుమార్ విలేకరులతో అన్నారు. సోన్‌బర్సా స్థానం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయిన సదాతో ఇక్కడి రాజ్‌భవన్‌లో బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ చేత పదవీ ప్రమాణం చేయించారు. కాగా. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నుంచి వైదొలిగిన మాంఝీ కుమారుడు సంతోష్ కుమార్ సుమన్ మాట్లాడుతూ నితీశ్ కుమార్ జేడీ(యూ) లోకి హెచ్ఏఎం(ఎస్) ని విలీనం చేయాలనే ప్రతిపాదనను ఇచ్చిన తర్వాత పార్టీని కాపాడుకోవడానికి నేను మంత్రి పదవిని వదులుకున్నానని తెలిపారు. ఇదిలాఉండగా, నితీశ్ కుమార్ మాట్లాడుతూ 'మాంఝీకి మా పార్టీ చాలా ఇచ్చింది. ఆయన పార్టీకి జేడీ(యూ) కోటా నుంచి రాష్ట్ర కేబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చారు. ఇన్ని చేసినా... బీజేపీ నేతలతో టచ్‌లో ఉన్నారు' అని నితీశ్ కుమార్ అన్నారు. లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగకపోవచ్చనే బలమైన అవకాశం ఉంది. వీటిని ముందుగానే నిర్వహించవచ్చు. అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావాలి. జూన్ 23 సమావేశం తర్వాత మనం సన్నాహాలు ప్రారంభించాలి' అని ముఖ్యమంత్రి అన్నారు.

దారుణం... ట్రాక్టర్‌తో తొక్కించి
పోలీసు ప్రాణాలు తీసిన ఇసుక మాఫియా



బెంగళూరు: కర్నాటకలో దారుణం చోటుచేసుకుంది. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో తొక్కించి కిరాతకంగా ప్రాణాలు తీసింది. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్‌ను అదే ట్రాక్టర్‌తో తొక్కించి, ప్రాణాలు తీశారు. 51 ఏళ్ల మైసూర్ చౌహాన్ కర్నాటక లోని నెలోగి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని పోలీసు అధికారులు తెలిపారు. విధుల్లో భాగంగా తనిఖీల నిమిత్తం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు ప్రయత్నించారని చెప్పారు. డ్రైవర్ ఆగకుండా పోలీసు పైకి ట్రాక్టర్‌ను పోనిచ్చాడనీ, నారాయణపుర గ్రామంలో ఈ ఘటన జరిగిందనీ, చౌహాన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. 'మేం డ్రైవర్‌ను అరెస్టు చేశాం. ఆ ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్నారు. ఆ సమయంలో కానిస్టేబుల్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు' అని కాల్బుర్గి పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఘటనపై కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే స్పందించారు. 'ఇసుక అక్రమ తవ్వకాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. వెంటనే ఈ ఘటనపై విచారణకు ఆదేశించాం' అని తెలిపారు.

ధరలు దిగొస్తున్నా ప్రజలకు దక్కేది శూన్యం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: తాజా ద్రవ్యోల్బణ సూచీ ప్రకారం నిత్యావసర ధరలు దిగివస్తున్నప్పటికీ టోకు వ్యాపారులు, ప్రభుత్వం లాభపడటమే గానీ అంతిమంగా వినియోగదారులకు ఎటువంటి ప్రయోజనం లభించడం లేదని కాంగ్రెస్ పార్టీ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ శుక్రవారం మాట్లాడుతూ ప్రభుత్వం మూగ ప్రేక్షకుడిగా ఉండకూడదని, రిటైల్ మార్కెట్‌లో వస్తువులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఎందుకు దిగిరావడం లేదని ప్రశ్నించారు. మెజారిటీ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడం వల్ల కేవలం టోకు వ్యాపారులు, ప్రభుత్వం లబ్ధి పొందుతున్నారని, తుది వినియోగదారులకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదన్నారు. అయినప్పటికీ సూట్ బూట్ కి సర్కార్ కేవలం ప్రేక్షకుడిగా ఎందుకు ఉండిపోతోందని వల్లభ్ ప్రశ్నించారు. 'మే 2022 నుండి మే 2023 వరకు ముడి చమురు ధరలు హోల్‌సేల్ మార్కెట్‌లో 27 శాతం తగ్గగా... ఆ ప్రయోజనం తాలూకు ఒక్క పైసా కూడా పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎందుకు ఇవ్వలేదు' అంటూ కేంద్రాన్ని నిలదీశారు. మే 2023లో కూరగాయలు, బంగాళదుంపలు, నూనెగింజల టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) సంఖ్యలు వరుసగా మైనస్ 20.12 శాతం, మైనస్ 18.71 శాతం, మైనస్ 15.65 శాతంగా ఉన్నప్పుడు, ఆహారం, పానీయాలపై వినియోగదారుల ధరల సూచిక 3.29శాతంగా ఉందని కాంగ్రెస్ వల్లభ్ చెప్పారు. 'రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు అమ్ముతున్నారు. అదే ఉత్పత్తులను స్వీయ వినియోగం కోసం ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. మోదీజీ... రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ఇదేనా పద్ధతి?' అని వల్లభ్ ప్రశ్నించారు. ఈ విధానం వల్ల రైతుల ఆదాయాన్ని రెట్టింపు కాకపోగా వారి ఆదాయం సగానికి సగం తగ్గుతుందని అన్నారు. మే 23న ముడి పెట్రోలియం, ఎల్‌పీజీకి సంబంధించిన డబ్ల్యూపీఐ సంఖ్యలు వరుసగా 27.01 శాతం, 24.35 శాతం తగ్గినప్పుడు రిటైల్ మార్కెట్‌లో ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గించలేదని కాంగ్రెస్ నాయకుడు ప్రశ్నించారు. ఈ విధంగా వచ్చిన ఆదాయ ప్రయోజనాలను ప్రభుత్వం తీసేసుకుందన్నారు.

మిత్ర దేశాల భద్రతా అవసరాలను తీరుస్తున్నాం: రాజ్‌నాథ్



బెంగళూరు: భారతదేశ రక్షణ పరిశ్రమ దేశీయ భద్రతా అవసరాలతో పాటు మిత్ర దేశాల భద్రతా అవసరాలను కూడా నెరవేరుస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం పేర్కొన్నారు. సంపూర్ణ స్వావలంబన లక్ష్యాన్ని సాధించడానికి భావజాలంతో సంబంధం లేకుండా, అన్ని పక్షాల నుండి ఎల్లప్పుడూ ఏకాభిప్రాయం ఉందని ఆయన పేర్కొన్నారు. 'రక్షణ తయారీలో స్వావలంబన'పై శుక్రవారం జరిగిన రక్షణ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశానికి రాజ్‌నాథ్ అధ్యక్షత వహించారు. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించడానికి రక్షణ మంత్రిత్వశాఖ తీసుకున్న కార్యక్రమాలు, నిర్ణయాల వల్ల ఇప్పటివరకు సాధించిన పురోగతి గురించి పార్లమెంట్ ఉభయ సభల కమిటీ సభ్యులకు మంత్రి వివరించారు. ఎప్పటికైనా అభివృద్ధి చెందుతున్న ప్రపంచం నుంచి ఉత్పన్నమయ్యే సవాళ్లను ఎదుర్కోవటానికి దేశ భద్రతను పెంపొందించడానికి సాయుధ దళాలను సాంకేతికంగా మెరుగుపర్చేందుకు ప్రభుత్వ నిరంతరం కృషి చేస్తోందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రక్షణ రంగానికి ఎన్నడూ లేని విధంగా బడ్జెట్ కేటాయింపులు జరిపామని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాలు ఫలిస్తున్నందునే నేడు దేశం దేశీయంగా జలాంతర్గాములు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ఆయుధాలను తయారు చేస్తోందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న రక్షణ పరిశ్రమ దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా, మిత్ర దేశాల భద్రతా అవసరాలను కూడా తీర్చగలదని ఆయన అన్నారు. 'గత ఆర్థిక సంవత్సరంలో మన రక్షణ ఉత్పత్తి లక్ష కోట్ల రూపాయలను దాటింది. ఎగుమతులు 16,000 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. రక్షణ రంగం, దేశం సరైన మార్గంలో ఉన్నాయనడానికి ఇది నిదర్శనం' అని రాజ్‌నాథ్ వివరించారు. భావజాలంతో సంబంధం లేకుండా, సంపూర్ణ స్వావలంబన లక్ష్య సాధనకు అన్ని పక్షాల నుండి ఎల్లప్పుడూ ఏకాభిప్రాయం ఉందని మంత్రి ప్రశంసించారు. ఈ సమావేశంలో రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, రక్షణశాఖ కార్యదర్శి గిరిధర్ అర్మనే, సెక్రటరీ (మాజీ సైనికుల సంక్షేమం) విజయ్ కుమార్ సింగ్, డీఆర్డీవో చైర్మన్ సమీర్ వీ కామత్ పాల్గొన్నారు.

కేంద్రం తీరుపై రాష్ట్రవ్యాప్త ఆందోళన
కర్నాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్ వెల్లడి

బెంగళూరు: కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని కర్నాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీకే శివకుమార్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము ప్రజలకు ఇచ్చిన ఉచిత బియ్యం హామీ నెరవేర్చకుండా కేంద్రం కుట్రలకు తెరలేపిందని ఆయన విమర్శించారు. బీజేపీవి విద్వేష రాజకీయాలని డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ చర్యలను నిరసిస్తూ ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపడుతాయని తెలిపారు. కేంద్రం ఎన్ని ఎత్తులు వేసినా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఉచిత బియ్యం హామీని తాము నెరవేర్చి తీరుతామని ఆయన స్పష్టంచేశారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పారీ ఎన్నికల్లో గెలిస్తే 'అన్న భాగ్య' పథకం కింద పేద కుటుంబాల్లో ప్రతి వ్యక్తికి 10కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని 'భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)' నుంచి అవసరమైన బియ్యం కొనుగోలుకు సిద్ధరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంకాగా కేంద్రం మోకాలడ్డింది. ఎఫ్‌సీఐ నుంచి రాష్ట్రాలు బియ్యం కొనుగోలు చేసే నిబంధనల్లో మార్పులు చేసింది. కేవలం ఈశాన్య రాష్ట్రాలు మాత్రమే ఎఫ్‌సీఐ నుంచి బియ్యం కొనుగోలు చేసేలా నిబంధనలు మార్చినట్లు తెలిసింది. దాంతో కేంద్ర ప్రభుత్వ తీరుపై కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. విద్వేష రాజకీయాలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

తమిళనాడు మాజీ డీజీపీకి మూడేళ్ల జైలు

విల్లుపురం: లైంగిక ఆరోపణల కేసులో తమిళనాడు మాజీ డీజీపీ రాజేశ్ దాస్ దోషిగా తేలారు. తన తోటి మహిళా పోలీసు అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని నిర్ధారిస్తూ విల్లుపురం కోర్టు ఆయనకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.10 వేల జరిమానా కూడా వేసింది. అయితే ఈ తీర్పుపై 30 రోజుల్లో ఆయన అప్పీలుకు వెళ్లచ్చని పేర్కొంటూ, బెయిల్ కూడా మంజూరు చేసింది. ఇదే కేసులో అప్పటి చెంగల్‌పట్టు ఎస్పీ కన్నన్‌కూ న్యాయస్థానం జరిమానా విధించింది. రాజేశ్ దాస్‌పై ఫిర్యాదు చేసేందుకు చెన్నై వెళ్తున్న బాధిత మహిళా అధికారిని అడ్డుకున్నందుకు ఆయన్ను దోషిగా తేల్చింది. రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో పోలీసు సిబ్బంది సహా 68 మంది వ్యక్తుల వాంగ్మూలాలను కోర్టు నమోదు చేసింది. ఐపీఎస్ అధికారి రాజేశ్ దాస్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఓ మహిళా ఐపీఎస్ ఆఫీసర్ 2021 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామి సభకు బందోబస్తు నిర్వహించేందుకు వాహనంలో వెళ్తున్న సమయంలో తనను లైంగికంగా వేధించారని పేర్కొన్నారు. దీనిపై చర్యలు చేపట్టిన నాటి అన్నాడీఎంకే ప్రభుత్వం... రాజేశ్ దాస్‌ను సస్పెండ్ చేసింది. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీతో ఈ వ్యవహారంపై విచారణ జరిపించింది. ఘటన జరిగిన సమయంలో తమిళనాడు స్పెషల్ డీజీపీ హోదాలో రాజేశ్ దాస్ ఉన్నారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
ఐదుగురు ఉగ్రవాదుల హతం

కుప్వారా: జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. జిల్లాలోని వాస్తవాధీన రేఖ సమీపంలో ఉన్న జుమాగండ్‌లో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. గురువారం తెల్లవారుజామున జుమాగండ్ వద్ద విదేశీ ఉగ్రవాదులు భారత్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. అడ్డుకున్న సైన్యంపై టెర్రరిస్టులు కాల్పులకు దిగారు. ప్రతిగా జవాన్లు జరిపిన ఎదురుకాల్పుల్లో ఐదురుగు ఉగ్రవాదులు హతమయ్యారని కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసులతోపాటు సైన్యం ఆ ప్రాంతాన్ని జల్లడపడుతున్నదని ట్వీట్ చేశారు. మరణించిన ముష్కరులంతా విదేశీయులని వెల్లడించారు. ఈ నెల 13న కూడా కుప్వారాలో ఎల్‌ఓసీ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు టెర్రరిస్టులు హతమయ్యారు. జిల్లాలోని డోబనార్ మచ్చల్ ప్రాంతంలో పోలీసులు, భద్రతా దళాలు ఉమ్మడిగా గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌందర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించినట్లు పోలీసులు తెలిపారు.

ఆహార భద్రతకు సమష్టి చర్యలు అవసరం
ప్రధాని నరేంద్ర మోదీ

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయరంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ ఆహార భద్రతను సాధించేందుకు సమష్టి చర్యలను ఏ విధంగా చేపట్టాలనే దానిపై చర్చించాలని జీ-20 వ్యవసాయ మంత్రులను మోదీ కోరారు. హెచ్ఐసీసీలో ప్రతిష్ఠాత్మక జీ-20 సభ్య దేశాల వ్యవసాయ శాఖ మంత్రుల మూడురోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జీ-20 సభ్య దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ పరిశోధన సంస్థల అధిపతులు, శాస్త్రవేత్తలు, నిపుణులు 250 మంది వరకు ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలిరోజు సదస్సుకు ముఖ్య అతిథిగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రధాని మాట్లాడుతూ... భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావంతో సరఫరా గొలుసు అంతరాయాలు మరింత తీవ్రమయ్యాయన్నారు. దక్షిణాది ప్రపంచం ఈ సవాళ్లను ఎక్కువగా అనుభవిస్తుండగా, వాతావరణ మార్పు... తీవ్ర వాతావరణ సంఘటనలకు తరచుగా కారణమవుతోందని ఆయన అన్నారు. 'ప్రపంచ ఆహార భద్రతను సాధించేందుకు సమిష్టి చర్యను ఎలా చేపట్టాలనే దానిపై నేను మిమ్మల్ని కోరుతున్నాను. సన్నకారు రైతులపై దృష్టి సారించి స్థిరమైన, సమ్మిళిత ఆహార వ్యవస్థలను నిర్మించడానికి, ప్రపంచ ఎరువుల సరఫరా గొలుసులను బలోపేతం చేయడానికి మనం మార్గాలను కనుగొనాలి' అని ప్రధాన మంత్రి అన్నారు. అదే సమయంలో భూసారం బాగుండి, పంటలు ఆరోగ్యం ఎదిగి మంచి దిగుబడులు వచ్చే వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు. పునరుత్పాదక వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో అవలంబించే సంప్రదాయ పద్ధతులు మనకు స్ఫూర్తినిస్తాయని మోదీ అన్నారు. వ్యవసాయం, ఆహార వ్యర్థాలను తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయంగా వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడంపై పెట్టుబడి పెట్టాలని ఆయన అన్నారు భారత ప్రభుత్వం సహజ వ్యవసాయంతో పాటు సాంకేతికతతో కూడిన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. భారతదేశంలోని రైతులు ఇప్పుడు సహజ వ్యవసాయం చేస్తున్నారని, వారు సింథటిక్ ఎరువులు లేదా పురుగుమందులు ఉపయోగించడం లేదని ఆయన అన్నారు. మాతృభూమిని పునరుజ్జీవింపజేయడం, నేల ఆరోగ్యాన్ని కాపాడడం, ప్రతి నీటి చుక్కను వృథా కానీయకుండా సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగం, తెగుళ్ల నిర్వహణ పరిష్కారాలను ప్రోత్సహించడంపై వారి దృష్టి ఉందని మోదీ చెప్పారు.

అరుంధతీరాయ్‌కు 'యూరోపియన్ ఎస్సే ప్రైజ్' అవార్డు

న్యూఢిల్లీ: ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌కు జీవితకాల సాఫల్య పురస్కారంగా ప్రతిష్ఠాత్మక '45వ యూరోపియన్ ఎస్సే ప్రైజ్' లభించింది. చార్లెస్ వీలాన్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. 'ఆజాది' (2021) పేరుతో ఆమె రాసిన వ్యాసాల సంకలనానికి ఫ్రెంచ్ అనువాదం కోసం అరుంధతీ రాయ్‌కు ఈ పురస్కారం దక్కింది. ఢిల్లీకి చెందిన అరుంధతీరాయ్ రచించిన "ది గాడ్ ఆఫ్ స్మాల్ థింగ్స్", "ది మినిస్ట్రీ ఆఫ్ అట్మోస్ట్ హ్యాపీనెస్", "మై సెడిషియస్ హార్ట్" బుకర్ ప్రైజ్ గెలుచుకున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలను పొందాయి. సెప్టెంబరు 12న స్విట్జర్లాండ్‌లోని లౌసాన్ నగరంలో జరిగే వేడుకలో రాయ్... సుమారు రూ. 18 లక్షల నగదు బహుమతితో పాటు అవార్డును అందుకోనున్నారు.

పేదల వ్యతిరేకి చంద్రబాబు

సీఎం వైఎస్ జగన్

గుడివాడలో టిడ్కో ఇళ్ల పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ: పేదల ఇళ్ల నిర్మాణానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉండి కూడా చంద్రబాబు ఆ పని ఎందుకు చేయలేకపోయారని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం కృష్ణాజిల్లా గుడివాడలోని మల్లాయిపాలెంలో నిర్మించిన 8912 టిడ్కో గృహాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహనరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధ్వర్యంలో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడుతూ 'మనం ఇళ్లు కాదు... ఊళ్లు కడుతున్నాం...టిడ్కో ఇళ్లు రూపాయికే ఇస్తామని గుడివాడలోనే హామీ ఇచ్చాం...నిజం చేసి చూపించాం... టిడ్కో ఇళ్లతో కొత్త గుడివాడ నగరం కనిపిస్తోంది. గుడివాడలో మొత్తంగా 13,145 మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చాం...8,192 టిడ్కో ఇళ్లతో కలిపి 16,240 గృహాలు అంటే 40 వేలకు పైగా జనాభా ఉన్నారు. ఒక్కొక్కరి ఇంటి స్థలం విలువ రూ.7లక్షలు. ఇల్లు కూడా పూర్తయితే రూ.10లక్షల ఆస్తి అవుతుంది' అన్నారు. టీడీపీ పెత్తందారుల పార్టీ అని, పేదల వ్యతిరేకి కాబట్టే చంద్రబాబు ఏం చేయలేదని విమర్శించారు. పేదవాడికి చంద్రబాబు నాయుడు ఏనాడూ సెంటు స్థలం ఇచ్చింది లేదని, మూడుసార్లు సీఎం అయినా టిడ్కో ఇళ్లు కట్టలేకపోయారని ఆరోపించారు. మంచి చేశాం కాబట్టే నాటి పాలనకు నేటి పాలనకు తేడా గమనించాలన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చామని, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. లంచాలకు తావు లేకుండా లబ్ధిదారులకు నేడు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. గ్రామస్థాయి నుంచే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ఈ నాలుగేళ్ల కాలంలో రూ. 2.16 లక్షల కోట్లు లబ్ధిదారులకు నేరుగా అందించినట్లు తెలిపారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే, కులాల సమతౌల్యం దెబ్బతింటుందని చంద్రబాబు కోర్టుల కెక్కాడన్నారు. ప్రజలకు మంచి చేసిన చరిత్రే చంద్రబాబుకు లేదన్నారు. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే కుప్పంలో ఇల్లు కట్టుకుంటానని అంటున్నారని, మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు తయారయ్యారని విమర్శించారు. ఇది చేస్తా అది చేస్తా అంటారే తప్ప సీఎంగా ఉన్నప్పుడు ఈ మంచి చేశాను కాబట్టి నాకు ఓటేయండి అని మాత్రం చంద్రబాబు అడగలేరన్నారు. జిత్తులు, ఎత్తులు, పొత్తులనే చంద్రబాబు నమ్ముకున్నారని, రెండు పక్కల కూడా రెండు పార్టీలు లేకుంటే చంద్రబాబు నిలబడలేడని తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చి 15 సంవత్సరాలు అయ్యి కూడా, తాను చంద్రబాబు కోసమే పుట్టానంటూ, తన జీవితమే చంద్రబాబు కోసం త్యాగమంటూ, తన వ్యాను చూసి మురిసిపోతూ తాను కూడా ఎమ్మెల్యే అవుతానంటూ తననెవరు ఆపుతారో చూస్తానని అనే ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై జగన్ విమర్శలు గుప్పించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివగంత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 25 అడుగుల విగ్రహాన్ని మహిళలతో కలిసి జగన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ, పురపాలక శాఖ కమిషనర్ పి.కోటేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్, కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ పి.జాషువా, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, టి.కల్ప లత, పోతుల సునీత, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రా మయ్య (నాని), పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

మ్యూజియానికి నెహ్రూ పేరు తొలగింపు

ఆగ్రహం వ్యక్తంచేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: భారత తొలి ప్రధానమంత్రి జవహార్‌లాల్ నెహ్రూ అధికారిక నివాసంగా ఉన్న తీన్‌మూర్తి భవన్ తాజా వివాదానికి కేంద్ర బిందువైంది. అందులో ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీ పేరును ప్రధానమంత్రుల మ్యూజియంగా మారుస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీనికి ఉపాధ్యక్షుడిగా ఉన్న రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మ్యూజియం పేరును మార్చాలని నిర్ణయించినట్లు సాంస్కృతిక శాఖ ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఎన్ఎంఎంఎల్ సొసైటీ నడుస్తుండగా సభ్యులుగా కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్, కిషన్ రెడ్డి, అనురాగ్ ఠాకూర్ సహా 29 మంది సభ్యులున్నారు. నెహ్రూ పేరుతో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ మ్యూజియం పేరును మార్చడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'జవహార్‌లాల్ నెహ్రూ నుంచి నరేంద్ర మోదీ వరకు ఎంతో మంది ప్రధానమంత్రులు చేసిన సేవలు, వారు ఎదుర్కొన్న సవాళ్లకు సంబంధించి అన్ని విషయాలను ఈ మ్యూజియం తెలియజేస్తుంది. అందుకే దీని పేరును మారుస్తూ చేసిన ప్రతిపాదన స్వాగతించదగినది' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రధానమంత్రులు అంటే ఓ సంస్థ అని అభివర్ణించిన ఆయన అందరు ప్రధానుల ప్రయాణాన్ని ఇంద్రధనస్సుతో పోల్చారు. ఇది అందంగా ఉండాలంటే ఇంద్రధనస్సులోని రంగులన్నీ సమపాళ్లలో ఉండాలని అభిప్రాయపడ్డారు.

అల్పబుద్ధిని బయట పెట్టుకున్నారు: ఖర్గే

ఈ నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇది వారి అల్పబుద్ధి, నిరంకుశ మనస్తత్వాన్ని తెలియజేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఎటువంటి చరిత్ర లేనివారే ఇతరుల చరిత్రను చెరిపివేస్తారని అన్నారు. 59ఏళ్లకు పైగా అంతర్జాతీయ మేధో భాండాగారంగా విరాజిల్లుతున్న, ఎన్నో విలువైన పుస్తకాలకు నిలయంగా ఉన్న ఈ మ్యూజియం పేరు మార్చడం తగదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. సంకుచిత మనస్తత్వం, ప్రతీకారానికి మోదీ మారుపేరుగా నిలుస్తున్నారని దుయ్యబట్టారు. అభద్రతాభావంతో ఉండే ఒక అల్పవ్యక్తి విశ్వగురువు అని ప్రచారం చేసుకుంటూ తిరుగుతున్నారని నరేంద్ర మోదీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

హరగోపాల్‌పై దేశద్రోహం కేసు ఉపసంహరించుకోవాలి

వామపక్ష పార్టీల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులపై పెట్టిన దేశద్రోహం కేసును (ఉపా) వెంటనే ఉపసంహరించుకోవాలని పది వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ప్రజలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు ప్రభుత్వ ఈ చర్యను నిరసించాలని విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు పార్టీల నేతలు కె.రామకృష్ణ (సీపీఐ), వి.శ్రీనివాసరావు (సీపీఎం), వై.సాంబశివరావు(సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), జాస్తి కిశోర్‌బాబు (సీపీఐ ఎంఎల్), కాటం నాగభూషణం(ఎంసీపీఐ యూ), ఎస్.మూర్తి (సీపీఐ ఎంఎల్ లిబరేషన్), చిట్టిపాటి వెంకటేశ్వర్లు (సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), బీఎస్ అమర్‌నాథ్ (ఎస్‌యూసీఐసీ), పీవీ సుందర రామరాజు (ఫార్వర్డ్ బ్లాక్), జానకి రాములు (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హరగోపాల్ నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వానికి సరైన సూచనలు చేస్తూ, అభ్యుదయ భావాలతో రాష్ట్ర, దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తికి మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో ప్రభుత్వం దేశద్రోహం కేసును బనాయించడాన్ని వామపక్ష పార్టీలు ఖండిస్తున్నాయి. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్‌గా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పదవీ విరమణ చేసిన తరువాత కూడా ఆయన ప్రజాసేవలో వున్నారని చెప్పారు. ఉపాధి, త్రాగునీరు, భూసమస్యలు, దళిత, గిరిజనులపై దాడులు తదితర అంశాలపై స్పందిస్తూ సమావేశాలు, సెమినార్లు పెడుతూ ప్రభుత్వం దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు అభిశంసించిన దేశద్రోహ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలి

ఈపీడీసీఎల్ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ పంపిణీ సంస్థలు పంపిణీ నష్టాలను సాధ్యమైనంతగా తగ్గించుకోవాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఈపీడీసీఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, అదే క్రమంలో విద్యుత్ బకాయిల విషయంలోనూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలకు సంబంధించిన పెండింగ్ బకాయిలును వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. న్యాయస్థానాల్లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈపీడీసీఎల్ పరిధిలో 33 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం పనులు మందకొడిగా జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల పరిధిలో సాంకేతికంగా ఎక్కడైతే లో ఓల్టేజీ సమస్య ఉందో పరిశీలించి, అక్కడ మాత్రమే కొత్త సబ్ స్టేషన్లను నిర్మించాలని సూచించారు. 33 కేవీ సబ్ స్టేషన్లు మంజూరు చేసినా పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని, కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ఆదేశించారు. కోస్తా ప్రాంతంలో పీక్ లోడ్ పరిస్థితిని చక్కదిద్దేందుకు పరిశ్రమల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలని కోరారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో విద్యుద్దీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు అందిస్తున్న సేవల కోసం ప్రత్యేకంగా వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేశారని, అదే మాదిరిగా ఈపీడీసీఎల్‌లోనూ ఆన్‌లైన్‌లో సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు వచ్చేలా అవగాహన పెంచాలని, సచివాలయ స్థాయిలో ఎనర్జీ అసిస్టెంట్‌ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ భద్రతపై సిబ్బందికి శిక్షణ ఇచ్చి, ప్రమాదాల నివారణకు పోల్ టు పోల్ సర్వే చేయాలని సూచించారు. లూజ్ లైన్లను మార్చడంతో పాటు పాడైపోయిన కండక్టర్ లను ఎప్పటికప్పుడు మార్చాలన్నారు. ఈదరు గాలుల వల్ల విద్యుత్ స్తంభాలు పడిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో కొన్నిచోట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై అధికారులు యుద్ధ ప్రాతిపదికన వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, జెన్‌కో ఎండి కేవీఎన్ చక్రధర్ బాబు, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ తదితరులు హాజరయ్యారు.

చంద్రబాబు నివాసం జప్తు కేసులో తీర్పు రిజర్వు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణా నదీ తీరంలోని టీడీపీ అధినేత చంద్రబాబు నివాసముండే లింగమనేని రమేశ్ ఇంటి జప్తు కేసుకు సంబంధించి ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. లింగమనేని రమేశ్ ఇంటి జప్తునకు అనుమతి కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటీషన్‌పై విజయవాడ ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. సీఐడీ ఎస్పీ జయరాజును లింగమనేని ఇంటి ఎటాచ్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను న్యాయస్థానం అడిగింది. ఆ మేరకు కేసు విచారణ అధికారి అయిన ఏఎస్పీ కోర్టుకు పూర్తి వివరాలతో డాక్యుమెంట్లు సమర్పించారు. ఉభయపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 28న ఉత్తర్వులు ఇస్తామని తెలిపింది. లింగమనేని ఇంటి విషయంలో జప్తు చేయడానికి అవసరమైన ప్రాథమిక ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని ఏఎస్పీ కోర్టుకు తెలియజేసినట్లు ప్రభుత్వ న్యాయవాది వివేకానంద తెలిపారు. ఇది క్విడ్‌ప్రోకోగా ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు న్యాయవాది తెలిపారు. లింగమనేని రమేశ్ తరపు న్యాయవాది కూడా సీఐడీ అధికారులు కావాలనే ఆరోపణలు సృష్టిస్తున్నారని, వాటిని నిరూపించడానికి అవసరమైన పూర్తి ఆధారాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు మొదలైంది

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర-కుప్పం: ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు మొదలైందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శుక్రవారం కార్య కర్తలు, నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ నాయకులు పంచభూతాలను మింగేసారని అన్నారు. ప్రజల ఇళ్లపైనా ఈ వైసీపీ రాక్షసులు పడతారని నేను చెబితే ముందుగా అందరూ నమ్మలేదని, కానీ ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతుంది కదా అని అన్నారు. విశాఖలో జరిగిన వైసీపీ ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ అక్కడి పరిస్థితులకు ఒక ఉదాహరణ అని చంద్రబాబు అన్నారు. హుద్ హుద్‌ను సైతం తట్టుకున్న విశాఖ నేడు అక్రమార్కులకు విలవిల్లా డుతోందని అన్నారు. రాష్ట్రంలో వ్యక్తులను, ప్రజలను భయపెట్టి జగన్ ఇంతకాలం పాలన చేశాడని, అయితే ఇప్పటి వరకు జనం అన్నీ భరించారని, ఇప్పుడు ఎదురు తిరుగు తున్నారని, తిరుగుబాటు మొదలైందని తెలిపారు. ఇక రానున్న రోజుల్లో వైసీపీని రాష్ట్రం నుంచి తరిమేయడమే మిగిలిందని అన్నారు. పులివెందులలో జగన్ భయపెట్టి గెలుస్తున్నాడని, కానీ కుప్పంలో ప్రజల అభిమానంతో తాను గెలుస్తున్నానని అన్నారు. కుప్పంలో నేడు అన్ని అభివృద్ధి పనులను నిలిపివేసింది వైసీపీ ప్రభుత్వం వాస్తవం కాదా అని చంద్రబాబు ప్రశ్నించారు. దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టాల్సిన బాధ్యత సీనియర్ నేతగా తనకు ఉందని చెప్పారు. అందరిలా భయపడి నేనూ రాష్ట్రాన్ని వదిలేస్తే రాష్ట్రం పూర్తిగా నాశనం అవుతుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల స్థితిగతులు చూసి మహానాడులో మేనిఫెస్టో విడుదల చేశామని, పేదలను ధనికులను చేయడం అనేది సంకల్పం అని వివరించారు. అప్పులు చేసుకుంటూ పోవడం గొప్పవిషయం కాదని, సంపద సృష్టించి, దానిని పేదలకు పంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. నేడు రాష్ట్రంలో ప్రభుత్వ ఆదాయం ఎందుకు పడిపోయిందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణకు, ఏపీ మధ్య ఆదాయాల్లో వ్యత్యాసం రూ.40 వేల కోట్లు ఉందని, టీడీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ నష్టం ఉండేది కాదన్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని చెప్పారు. 2014 తరువాత 5 ఏళ్లలోనే ఎంతో అభివృద్ధి చేశామని, మధ్యలో ఓటమి లేకుండా తెలుగుదేశం పార్టీ గెలిచి ఉంటే రాష్ట్రం ఎక్కడ ఉండేదో ఊహించండి అని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి ధ్యాసలో పడి పార్టీకి ప్రాధాన్యం ఇవ్వకపోవడం అనేది వాస్తవమేనని, దీని వల్ల కూడా నష్టం జరిగిందని చెప్పారు. పవన్ కళ్యాణ్ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు తీవ్ర అభ్యంతరకరం అని చంద్రబాబు అన్నారు.

పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి

విద్యాశాఖా మంత్రికి పేరెంట్ కమిటీ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: పేద మధ్యతరగతి విద్యార్థుల పట్ల బాధ్యత వహించి ఇంటర్మీడియెట్ బోర్డు వారే పాఠ్యపుస్తకాలను, నోటు పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని కోరుతూ 'ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్' రాష్ట్ర గౌరవాధ్యక్షులు మలిరెడ్డి కోటా రెడ్డి. అధ్యక్షులు ఎస్. నరహరి. కార్యదర్శి జి.ఈశ్వరయ్య శుక్రవారం విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ముద్రించిన పాఠ్యపుస్తకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని ఉన్న వాటిని కొనుగోలు చేసుకోవాలని ఇంటర్ విద్యా శాఖ ఆ దేశాలు జారీ చేయడాన్ని తప్పుపట్టారు. పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై 2000 నుండి 2500 రూపాయలు భారం పడుతుందని, కనుక బోర్డు వారే పాఠ్య పుస్తకాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేటికీ ఇంటర్మీడియట్ బోర్డు వారు ఫీజులు నిర్ధారణ చేయకపోవడం, ప్రైవేటు జూనియర్ కళాశాలలో లక్షల్లో ఫీజుల దోపిడీ, కళాశాలల లోనే పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాల అమ్మకాలు జరుగుతున్న చర్యలు తీసుకోపోవడం దారుణం అన్నారు.

'ఆర్ఆర్ఆర్' తర్వాత 'ఆదిపురుష్' రికార్డు..

హైదరాబాద్: 'ఆదిపురుష్' సినిమా విడుదలకు ముందే రికార్డు నెలకొల్పింది. ఆన్లైన్.. సినిమా టికెట్ బుకింగ్ పోర్టల్ 'బుక్ మై షో' వేదికగా 10లక్షలమంది ఈ చిత్రాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. సదరు యాప్ వేదికగా 1.75 మిలియన్ ఇంట్రెస్టులతో 'ఆర్ఆర్ఆర్' మొదటి స్థానంలో ఉండగా.. ఇప్పుడు 1 మిలియన్ లైక్స్ తో 'ఆదిపురుష్' రెండో స్థానంలో నిలిచింది. 'బాహుబలి 2' తర్వాత అత్యధికంగా ఇంట్రెస్టు పొందిన ప్రభాస్ సినిమా ఇదే. రామాయణాన్ని ఆధారంగా చేసుకుని అత్యున్నత టెక్నాలజీని ఉపయోగించి దర్శకుడు ఓంరౌత్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలో ప్రభాస్ రాఘవుడిగా, హీరోయిన్ కృతిసనన్ జానకిగా, లంకేశ్గా సైఫ్ అలీఖాన్ కనిపించనున్నారు. శుక్రవారం విడుదలకానున్న ఈ సినిమా టికెట్లు అడ్వాన్స్ బుకింగ్స్లో క్షణాల్లోనే అత్యధికంగా విక్రయం జరిగాయి. ఢిల్లీలోని కొన్ని మల్టీప్లెక్ ల్లో టికెట్ ధరలు రూ.1500 నుంచి రూ.2200 వరకు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు టికెట్ ధరలు పెంచిన విషయం తెలిసిందే. తెలంగాణలో ఆరు షోలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

'గుంటూరు కారం' కష్టాలు.. ఏం జరుగుతోంది?

హైదరాబాద్: సూపర్ స్టార్ మహేష్ బాబు చివరగా 'సర్కారు వారి పాట'లో కనిపించాడు. ఆ సినిమా వచ్చి ఏడాది పైనే అయిపోయింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గుంటూరు కారం' మూవీ చేస్తున్నాడు. చాలా రోజుల క్రితమే షూటింగ్ మొదలుపెట్టినప్పటికీ.. ఎందుకో ఆ కష్టాలు మాత్రం వదలట్లేదు. దీంతో ఇప్పుడు ఫ్యాన్స్ కి లేనిపోని సందేహాలు వస్తున్నాయి. మహేష్ - త్రివిక్రమ్ కాంబోలో హ్యాట్రిక్ సినిమా గతేడాది అనౌన్స్ చేయగానే అందరూ తెగ ఎగ్జైట్ అయిపోయారు. 'అతడు', 'ఖలేజా'కి మించి ఉండబోతుందనే అంచనాలు పెంచేసుకున్నారు. కానీ రియాలిటీలో మాత్రం షూటింగ్ నత్తనడకన సాగుతోంది. గతంలో ఓ షెడ్యూల్ చేశారు ఆ తర్వాత నుంచి షూటింగ్ అస్సలు కుదరట్లేదు.రీసెంట్ గా మహేష్ తండ్రి కృష్ణ జయంతి సందర్భంగా 'గుంటూరు కారం' టీజర్ - ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. యూట్యూబ్‌లో ఇది ఫ్యాన్స్‌ని ఎంటర్ టైన్ చేస్తోంది. మరోవైపు జూన్ 7న కొత్త షెడ్యూల్ మొదలవ్వాల్సి ఉంది. ఏమైందో ఏమో గానీ జూన్ 12కి, ఆ తర్వాత జూన్ 20కి వాయిదా వేశారు. ఇప్పుడు ఏకంగా జూలైకి షిఫ్ట్ చేసినట్లు తెలుస్తోంది. హీరో మహేష్ బాబు రెడీగా ఉన్నాసరే కొందరు కీలకమైన యాక్టర్స్ డేట్స్ దొరకలేదని, అందుకే షూటింగ్ వరసగా వాయిదా పడుతుందని తెలుస్తోంది. ఇప్పటికే జనవరి 13న సంక్రాంతికి రిలీజ్ అని ప్రకటించారు. కానీ ఈ వాయిదాలు చూస్తుంటే మాత్రం అది కష్టమేనేమో అనిపిస్తుంది. మరి మహేష్-త్రివిక్రమ్ కలిసి ఏం చేస్తారో చూడాలి?

ప్రతిపక్ష పార్టీలు ఐక్యం కావాలి

ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్

ముంబై: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయాన్ని అందించడా నికి ఉమ్మడి కనీస కార్యక్రమం ఆధారంగా ఐక్యత కోసం అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒప్పించనున్నట్లు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ శుక్రవారం తెలిపారు. ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధి కారంలో ఉన్న మెజారిటీ రాష్ట్రాల్లో తిరస్కర ణకు గురైందని, అధికారాన్ని చేజిక్కించుకో వడానికి కాషాయ పార్టీ ఎన్నికయిన ప్రభు త్వాలను పడగొట్టిందని అన్నారు. 'రాష్ట్ర స్థాయిలో ప్రజలు బీజేపీని తిరస్కరించి నట్లయితే, వారి (పౌరుల) అభిప్రాయం జాతీయ స్థాయిలో భిన్నంగా ఉండదు' అని ఎన్‌సీపీ అధ్యక్షుడు నొక్కి చెప్పారు. జూన్ 23న బీహార్‌లోని పాట్నాలో జరిగే ప్రతిపక్ష పార్టీల సమావేశంలో తన అభిప్రాయాన్ని వెల్లడిస్తానని పవార్ తెలిపారు. 'బీజేపీయేతర పార్టీలన్నీ కలిసి కూర్చుని ఉమ్మడి కనీస కార్యక్రమం ఆధారంగా ప్రతిపక్ష ఐక్యత గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. బీజేపీ పెద్ద పెద్ద హామీలు ఇచ్చింది, ప్రజల అంచనాలను పెంచింది, కానీ ఏమీ చేయలేదు. ఇది ప్రత్యామ్నాయాన్ని అందించడానికి సమయం' అని అన్నారు.

క్రిమినల్స్‌కు అడ్డాగా వైసీపీ ప్రభుత్వం

జనసేన అధినేత పవన్ కల్యాణ్

పిఠాపురంలో వారాహి యాత్ర

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం క్రిమినల్స్‌కు అడ్డాగా మారిందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. రాష్ట్రంలో యువతను గంజాయి, మత్తుపదార్థాలకు బలిచేస్తు న్నారన్నారు. వైసీపీ వల్ల ఏపీ యువత మత్తులో తూగుతోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం ఇంకోసారి అధికారంలోకి వస్తే ఎవరినీ బతక నివ్వరని పవన్ పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ అన్నవరంలో ప్రారంభమైన జనసేన వారాహి యాత్ర తొలిరోజు ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడిలో భారీ బహిరంగ సభతో ముగిసింది. అక్కడి నుంచి 15వ తేదీ పిఠాపురం నియోజక వర్గంలో ప్రవేశించి గొల్లప్రోలు నగర పంచాయితీ ప్రైవేట్ కల్యాణమండపంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలనుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. రైతులతోను, యువకుల తోను, వికలాంగులతోను, పాత్రికేయుల తోను, మహిళా నాయకులతోను, వివిధ వర్గాల నాయకుల తోను అనేక విషయాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై పవన్ చర్చలు జరిపారు. అనంతరం శు క్రవారం సాయంత్రం పిఠాపురంలో స్థానిక ఉప్పాడు బస్టాండ్ జంక్షన్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది జనసైనికులు, వీర మహిళలు వెంటరాగా, గొల్లప్రోలు నుండి పిఠాపురం వరకు భారీ ర్యాలీగా వారాహిపై వచ్చిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ బహిరంగ సభలో మాట్లాడుతూ... జనసైనికులు, వీర మహిళలు, అండదండలతో దశాబ్దకాలం నుంచి జనసేన పార్టీ ధైర్యంగా నిలబడి ఉందని, భవిష్యత్‌లో కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటానని తెలిపారు. ఊపిరి ఉన్నత వరకు జనసేన ప్రజా సేవలో నిమగ్నమై ఉంటుం దన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో రెండు రోజుల నుండి అనేక సమస్యలను అవగతం చేసుకోవడం జరిగిందని, మత్స్యకారులు, పట్టు పరిశ్రమ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆయన తెలిపారు. 2024 ఎన్నికల్లో జనసేనను గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. జనసేన ప్రభుత్వంలో శాంతిభద్రతలను పగడ్బం దిగా అమలు చేస్తామని, నిజాయితీ గల పోలీస్ అధికారులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తానని ఆయన అన్నారు. తనకు ముఖ్య మంత్రిగా అధికారం ఇస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నెం.1 రాష్ట్రంగా అభివృద్ధిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకోసం పనిచేస్తానని, మానసికంగా రాష్ట్ర బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ముఖ్యమంత్రిని చేస్తే ఏపీ ప్రజలకు నిజమైన సేవలు అందిస్తానని పవన్ కల్యాణ్ అన్నారు. అధికార పార్టీ ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేశారని, ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమంగా మట్టి, ఇసుక, గంజాయి తదితర వ్యాపారాల్లో నిమగ్నమై ఉన్నారని ఆయన ఆరోపించారు. వైసీపీ గూండా ప్రభుత్వాన్ని జనసేన సమర్థంగా ఎదుర్కొంటుందని ఆయన అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.